



పంచాయతీలు ప్రక్షాళన

- క్లస్టర్ విధానానికి స్వస్తి
- గ్రేడ్ విధానం అమలు
- జిల్లాలో 450 పంచాయతీలు
- ఎక్కువగా గ్రేడ్-3 కేటాయించే అవకాశం



కురుపాం పంచాయతీ వ్యూ

పార్వతీపురం, మే 24 (ఆంధ్రజ్యోతి): పంచాయతీల ప్రక్షాళనకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. క్లస్టర్ విధానానికి స్వస్తి పలికి గ్రేడ్ విధానాన్ని అందుబాటులోకి తీసుకొచ్చేందుకు అవసరమైన చర్యలు చేపడుతుంది. గతంలో ఒక క్లస్టర్‌లో రెండు లేదా మూడు పంచాయతీలు ఉండేవి. తాజాగా జనాభా, వార్షిక ఆదాయాన్ని పరిగణలోకి తీసుకొని పంచాయతీలను గ్రేడ్లగా విభజించనున్నారు. ఈ మేరకు అధికారులు కసరత్తు ప్రారంభించారు. జిల్లాలో 15 మండలాల్లో 450 పంచాయతీలు ఉన్నాయి. పాత లెక్కల ప్రకారం ఇందులో గ్రేడ్-5లో 170, గ్రేడ్-2లో మూడు, గ్రేడ్-1లో రెండు పంచాయతీలు ఉన్నాయి. ప్రస్తుతం క్లస్టర్‌లో మేజర్ పంచాయతీలు, మైనర్ పంచాయతీల వ్యవస్థ నడుస్తుంది. రెండు లేదా మూడు పంచాయతీలను ఒక క్లస్టర్‌గా ఏర్పాటు చేసి ఒక కార్యదర్శిని నియమించి పాలన సాగిస్తున్న పరిస్థితి ఉంది. ఇకపై జనాభా, ఆదాయం ఆధారంగా పంచాయతీలకు గ్రేడ్‌లు ఇవ్వనున్నారు. ప్రతి నియోజకవర్గంలో ఒక ఆదర్శ పంచాయతీని తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతుంది. గ్రేడ్ విధానంలో సచివాలయ సిబ్బందిని అవసరాలకు అనుగుణంగా సర్దుబాటు చేయనున్నారు. ఇందుకోసం గ్రామ, వార్డు సచివాలయాల అధికారులు కసరత్తు ప్రారంభించారు.

గ్రేడుల కేటాయింపు ఇలా..

10 వేల జనాభా లేదా ప్రభుత్వ గ్రాంట్లు కాకుండా కోటి రూపాయల ఆదాయం వచ్చే పంచాయతీలకు ప్రత్యేక గ్రేడ్ కేటాయించనున్నారు. వీటికి ఈవోపీఆర్‌డీలను పంచాయతీ అధికారులుగా నియమిస్తారు. వీరిని డిప్యూటీ ఎంపీడీవోలుగా పిలవనున్నారు. వీటి పరిధిలోకి మేజర్ పంచాయతీలను తీసుకురానున్నారు. ● 4 వేల నుంచి 10 వేల మధ్య జనాభా లేదా రూ.50 లక్షల నుంచి కోటి రూపాయల ఆదాయం ఉండే పంచాయతీలను గ్రేడ్-1గా ఎంపిక చేయనున్నారు. మండల కేంద్రాలుగా ఉండే పంచాయతీలను వీటి పరిధిలోకి తీసుకురానున్నారు. ● రెండు వేల నుంచి నాలుగు వేల మధ్య జనాభా గల పంచాయతీలను గ్రేడ్-2గా పరిగణిస్తారు. ● రెండు వేలు కన్నా తక్కువ జనాభా ఉండే పంచాయతీలను గ్రేడ్-3 పరిధిలోకి తీసుకురానున్నారు. ఈ విధంగా జిల్లాలోని పంచాయతీలను జనాభా, అదే విధంగా ఆదాయం పరిగణలోనికి తీసుకుని గ్రేడింగ్ విధానాన్ని అమలు చేయనున్నారు. జిల్లాలో అత్యధికంగా గిరిజన పంచాయతీలు ఉండడంతో ఇవన్నీ గ్రేడ్-3లోకి వెళ్లే అవకాశం ఉంది. ఎందుకంటే ఈ పంచాయతీల్లో రెండు వేలు కన్నా తక్కువ జనాభా ఉన్నారు.

నివేదిక అందిస్తాం

ప్రభుత్వ ఆదేశాల ప్రకారం పంచాయతీలను మూడు గ్రేడ్‌లుగా విభజిస్తాం. ఈ నివేదికను జిల్లా కలెక్టర్‌కు అందిస్తాం. తర్వాత పంచాయతీలకు గ్రేడ్లు ప్రకటిస్తాం.

-కొండలరావు, జిల్లా పంచాయతీ అధికారి

సదరం మరింత సులభతరం

- నెలరోజుల్లోనే సర్టిఫికెట్ జారీ
- 'మనమిత్ర'లో స్లాట్ బుక్ చేసుకుంటే చాలు
- యూడీ కార్డుతో అనుసంధానం
- నిరంతరం దరఖాస్తుకు అవకాశం
- ఆనందం వ్యక్తంచేస్తున్న దివ్యాంగులు

గరుగుబిల్లి, మే 24(ఆంధ్రజ్యోతి): దివ్యాంగులు మరింత సులభతరంగా సదరం సర్టిఫికెట్ పొందేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్‌తో సదరం స్లాట్ బుకింగ్ చేసుకుంటే చాలు సదరం సర్టిఫికెట్‌ను ఇవ్వాలని నిర్ణయించింది. స్లాట్ బుకింగ్ చేసుకున్న రోజు నుంచి నెల రోజుల్లోపు సదరం సర్టిఫికెట్ ఇచ్చేలా చర్యలు తీసుకుంటుంది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో సదరం సర్టిఫికెట్ పొందేందుకు దివ్యాంగులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఎప్పుడో ఒకసారి మాత్రమే దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉండేది. దరఖాస్తు చేసుకున్నా సర్టిఫికెట్‌ను జారీ చేసేందుకు నెలల తరబడి సమయం పట్టేది. దివ్యాంగుల పరిస్థితిని గమనించిన కూటమి ప్రభుత్వం సదరం దరఖాస్తులను నిరంతరం చేసుకునేందుకు అవకాశం కల్పించింది. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న యూనిక్ డిజెబిలిటీ ఐడీ కార్డు (యూడీ కార్డు)కు సదరం అనుసంధానం చేసింది. దరఖాస్తు చేసుకున్న నెల రోజుల్లోనే సదరం పత్రంతో పాటు వైకల్య శాతం సూచించే కార్డులను అందించనుంది. ప్రస్తుతం సదరం ధ్రువపత్రాలు రాష్ట్రంలోనే చెల్లుబాటు అవుతున్నాయి. అయితే, వీటిని యూడీ ఐడీకి అనుసంధానం చేయడంతో ఇకపై జారీ చేసిన కార్డులు దేశ వ్యాప్తంగా పరిగణలోకి తీసుకోనున్నారు.

ఇలా దరఖాస్తు చేసుకోవాలి..

సదరం స్లాట్ పొందేందుకు మీసేవ, గ్రామ సచివాలయాల్లో ఆధార్, పాస్‌పోర్టు సైజ్ ఫొటోతో దరఖాస్తు చేసుకోవాలి. పేరు, ఇంటిపేరు, పుట్టిన తేదీ, వయసు, లింగం, వైవాహిక స్థితి, కులం, మతం సహా విద్యార్హత, అలాగే రేషన్ కార్డు నెంబరు కూడా నమోదు చేయాలి. తరువాత ఆసుపత్రి, తేదీ, సమయం కేటాయిస్తూ ఫోన్‌కు మెసెజ్ వస్తుంది. కేటాయించిన ప్రభుత్వ ఆస్పత్రిలో నిర్వహించే శిబిరాల్లో వైద్యులు పరీక్షించి సదరం సర్టిఫికెట్‌ను అందిస్తారు. సర్టిఫికెట్ ఉన్నవారు రెన్యువల్ చేసుకునేందుకు కూడా స్లాట్‌ను బుక్ చేసుకోవాల్సి ఉంటుంది.





మూడు రకాల కార్డుల జారీ..

దివ్యాంగులకు మూడు రకాల యూనిక్ కార్డులను జారీ చేయనున్నారు. వైకల్యం 40 శాతం నుంచి 80 శాతం వరకు ఉంటే పసుపు రంగు కార్డు, 80 శాతానికి పైగా ఉంటే నీలి రంగు కార్డు, 40 శాతం కంటే తక్కువ వికలాంగత్వం ఉంటే తెలుపు కార్డును జారీ చేయనున్నారు. 40 శాతం, అంతకంటే ఎక్కువ వైకల్యం ఉన్నవారికి ప్రభుత్వ ఉద్యోగాల్లో 4 శాతం, అడ్మిషన్లలో 5 శాతం రిజర్వేషన్లు కల్పించనున్నారు. ప్రస్తుతం వీరికి సదరం ధ్రువపత్రాలు జారీ అవుతున్నాయి. 2016 చట్ట ప్రకారం యూడీ ఐడీ విధానంలో 40 శాతం కంటే తక్కువ వైకల్యం ఉన్నవారికి ప్రత్యేక కార్డులను అందించనున్నారు. వీరికి సదుపాయాలు తక్కువగా అందనున్నాయి. 40 శాతం దాటిన వారికి ప్రభుత్వ నిబంధనల మేరకు ఎన్టీఆర్ భరోసా పింఛన్లు, ఇతర సదుపాయాలు వర్తించనున్నాయి. మనమిత్ర గవర్నెన్స్‌లో నిరంతరంగా ధ్రువీకరణ పత్రాల జారీకి అవకాశం కల్పించడంతో దివ్యాంగులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

సీట్లు తక్కువ.. పోటీ ఎక్కువ

- ఇదీ గురుకుల కళాశాలల్లో పరిస్థితి
- ప్రవేశాల కౌన్సెలింగ్‌కు పోటెత్తిన విద్యార్థులు



సీతంపేట రూరల్: విద్యార్థినికి సీటు పత్రాన్ని అందిస్తున్న పీవో

పార్వతీపురం/సీతంపేటరూరల్, మే24 (ఆంధ్రజ్యోతి): ఉత్తమ బోధనతో పాటు మౌలిక వసతులు మెరుగ్గా ఉండడంతో గురుకుల కళాశాలల్లో ప్రవేశాల కోసం విద్యార్థులు పోటీ పడుతున్నారు. సీట్లు పొందేందుకు ఎగబడుతున్నారు. అయితే, ఒక సీటుకు ఇద్దరు ముగ్గురు పోటీపడుతున్నారు. దీనివల్ల చాలామందికి దొరకడం లేదు. దీంతో సీట్లు తక్కువ.. పోటీ ఎక్కువ అన్నచందంగా పరిస్థితి తయారైంది. పార్వతీపురం, సీతంపేట ఐటీడీఏల పరిధిలోని గురుకుల కళాశాలల్లో ఇంటర్ ప్రవేశానికి శనివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఐటీడీఏ పీవోలు అశుతోష్ శ్రీవాత్సవ, సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి కౌన్సెలింగ్ ప్రారంభించారు. పార్వతీపురం గురుకుల కళాశాల పరిధిలో 600 సీట్లు ఉండగా 1,150 మంది విద్యార్థులు కౌన్సిలింగ్‌కు హాజరయ్యారు. మెరిట్ ప్రాతిపదికన వారికి సీట్లు కేటాయించారు. కౌన్సెలింగ్‌కు హాజరైన కొంతమంది విద్యార్థులకు సీట్లు దక్కకపోవడంతో నిరాశతో వారంతా వెనుతిరిగారు. సీతంపేట బాలికల గురుకుల కళాశాలలో ఎంపీసీ 40, బైపీసీ, 40, హెచ్‌ఈసీ 40, ఏఅండ్‌టీ 20 మొత్తం 140 సీట్లు ఉన్నాయి. అయితే, సుమారు 450 మంది బాలికలు కౌన్సెలింగ్‌కు హాజరయ్యారు. మెరిట్ ప్రాతిపదికన 140 మందికి సీట్లు కేటాయించారు. మిగతా వారంతా ఇంటిబాట పట్టారు. అలాగే, సీతంపేట బాలుర గురుకుల కళాశాలలో ఎంపీసీ 40, బైపీసీ, 40, హెచ్‌ఈసీ 40, ఏఅండ్‌టీ 20, సీజీఏ 30 సీట్లు ఉన్నాయి. మొత్తం 170 సీట్లకుగాను 263 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 200 మంది కౌన్సెలింగ్‌కు హాజరయ్యారు. 162 మందికే సీట్లు కేటాయించారు. కొంతమంది విద్యార్థులకు సీట్లు దక్కకపోవడంతో ప్రతి ఏడాది ఇదే పరిస్థితి ఎదురవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సీట్ల సంఖ్య పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.



పార్వతీపురం: కౌన్సెలింగ్ సెంటర్ వద్ద విద్యార్థులు



పార్వతీపురం: విద్యార్థినితో మాట్లాడుతున్న పీవో

అమ్మో.. జూన్!

- పేద తల్లిదండ్రుల్లో ఫీజుల టెన్షన్
- భారీగా పెంచేస్తున్న విద్యా సంస్థల యాజమాన్యాలు
- గత ఏడాది కంటే పెరుగుదల

● రాజాంలోని ఓ జూట్‌మిల్లులో దినసరి కార్మికునిగా పనిచేస్తున్న పైడితల్లికి ఇద్దరు పిల్లలు. ఇంటర్‌లో ఒకరు, డిగ్రీలో మరొకరు చేరాల్సి ఉంది. దీంతో పైడితల్లి టెన్షన్ పడుతున్నాడు. జూన్ 1 నాటికి కనీసం రూ.50 వేలు అవసరమని తోటి కార్మికుల వద్ద చెప్పాడు. వడ్డీ ఎంతైనా పర్వాలేదు అప్పు కావాలని కోరాడు.

● బొబ్బిలికి చెందిన భవన నిర్మాణ కార్మికుడు కేశవరావుకు ఇద్దరు పిల్లలు. ఒకరు ఇంటర్ పూర్తిచేయడంతో డిగ్రీ చదవాల్సి ఉంది. ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రమే. దీంతో కేశవరావు తన భార్య మెడలోని బంగారం చైన్ తాకట్టు పెట్టి కొంత మొత్తం రుణంగా తీసుకున్నాడు.

రాజాం, మే 24 (ఆంధ్రజ్యోతి): పిల్లల చదువుకు తల్లిదండ్రులు ప్రాధాన్యం ఇస్తున్నారు. తమకన్నా వారు బాగుండాలన్న ఆలోచనతో ఆర్థికంగా భారమైనా భరిస్తున్నారు. రెక్కల కష్టం తో చదివిస్తున్నారు. పేదలు అవసరమైతే అప్పులు చేసేందుకూ వెనుకాడడం లేదు. అందుకే జూన్ వస్తోందంటే వారిలో టెన్షన్ మొదలైపోతుంది. సాధారణంగా ఒకటో తారీఖు అంటే ప్రతి నెలా ప్రత్యేకమే. జూన్ నెల అంటే ఇంకాస్త ప్రత్యేకం. సాధారణ జీవితానికి సరిపోయే ఖర్చులు చేతిలో ఉండాలి. పిల్లల ఫీజులు, పుస్తకాలు, యూనీఫారం తదితర వాటికోసం రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకూ చేతిలో ఉంచుకోవాలి.

గత ఏడాది ఓ మోస్తరు ప్రైవేటు పాఠశాలలో ఆరో తరగతి విద్యార్థి ఫీజు రూ.12,000గా ఉండేది. ఈ ఏడాది దానిని రూ.20,000 చేయాలని ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు చెబుతున్నాయి. చిన్నపాటి ప్రైవేటు పాఠశాలల్లో ప్రాథమిక తరగతులకు రూ.10 వేలు లోపే ఫీజుగా ఉండేది. కానీ కార్పొరేట్ సంస్థల ఫీజులు చూసి వారు సైతం పెంచేస్తున్నారు. ఇప్పటికే కార్పొరేట్ విద్యా సంస్థలు అడ్మిషన్ల కోసం పీఆర్వోలను రంగంలోకి దించాయి. మరికొన్ని యాజ మాన్యాలు నేరుగా విద్యార్థుల తల్లి దండ్రులకే ఫోన్లు చేస్తున్నాయి. ముందస్తుగా ఫీజు కట్టాలని.. అడ్మిషన్లు రాయించుకోవాలని ఒత్తిడి చేస్తున్నాయి. ఆలస్యం చేస్తే అడ్మిషన్లు ఉండవని తేల్చిచెబుతున్నాయి. దీంతో ఆందోళనకు గురవుతున్న తల్లిదండ్రులు ఫీజు కట్టి అడ్మిషన్ రాయించుకుంటున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఒకటో తరగతి నుంచి 3వ తరగతి వరకూ గ్రామీణ ప్రాంతాల్లో రూ.6 వేలు, మండల కేంద్రాల్లో రూ.7,500, పట్టణాల్లో రూ.8,500గా నిర్ధారించారు. 4-5 తరగతులకు గ్రామీణ ప్రాంతాల్లో ఏడాదికి రూ.9 వేలు, పట్టణాల్లో రూ.10,500, జిల్లా కేంద్రంలో రూ.12 వేలు, ఆరో తరగతికి గ్రామీణ ప్రాంతాల్లో రూ.9 వేలు, మండల కేంద్రాల్లో రూ.9,500, జిల్లా కేంద్రాల్లో రూ.11,100లను ఫీజులుగా నిర్ధారించారు. అయితే ఇంతకు మించి యాజమాన్యాలు డిమాండ్ చేస్తున్నాయి.




50 శాతం పెరుగుదల..

గత ఏడాది రూ.60లు ఉన్న నోటు పుస్తకం ధర ఈ ఏడాది రూ.75 పైమాటే. గత ఏడాది ఆరో తరగతి విద్యార్థులకు రూ.1000 వరకూ నోటుపుస్తకాలకు ఖర్చయ్యేది. ఇప్పుడు పెరిగిన ధరతో రూ.1500 పైమాటే. ఇది ఒక్క నోటుపుస్తకాలకే. ఇంకా పెన్నులు, పెన్సిళ్లు, ఇతరత్రా వస్తువుల కొనుగోలు అదనం. గత ఏడాది స్కూల్ బ్యాగు రూ.300 వరకూ దొరికేది. ఈ ఏడాది రూ.500 లేనిదే బ్యాగు దొరకదు అని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. ఇక బూట్లు, క్యారేజ్ బాక్సుల గురించి చెప్పనక్కర్లేదు. విద్యార్థుల రవాణాకు సంబంధించి చార్జీలు కూడా పెరగనున్నాయి. పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగాయంటూ ప్రైవేటు విద్యాసంస్థలు బస్ చార్జీలను పెంచుతున్నాయి. ఇదే అదనుగా విద్యార్థులను తరలించే ఆటోలు, నాలుగు చక్రాల వాహనాల చార్జీలు సైతం పెంచేశారు. గత ఏడాది ఐదు కిలోమీటర్ల దూరానికి నెలకు రూ.700 తీసుకునేవారు. ఈ ఏడాది రూ.1000 వరకూ తీసుకోవడానికి సిద్ధపడుతున్నారు.

ఎవరెవరు సహకరించారు?

- సిరాజ్ కుటుంబీకులు, స్నేహితుల గురించి కూడా ఆరా
- కొనసాగుతున్న ఎన్ఐఏ, యాంటీ టెర్రరిస్టు స్క్వాడ్ (ఏటీఎస్) విచారణ
- ఆర్థిక లావాదేవీలపై అన్ని కోణాల్లో శోధన
- విజయనగరంతో పాటు ఇతర రాష్ట్రాల్లోనూ విధ్వంసానికి కుట్ర



విజయనగరం/క్రైం, మే 24 (ఆంధ్రజ్యోతి): ఉగ్రవాద సానుభూతిపరులుగా గుర్తించిన విజయనగరం వాసి సిరాజ్‌ఉర్ రెహ్మాన్, హైదరాబాద్‌కు చెందిన సయ్యద్ సమీర్‌ల విచారణ రెండోరోజు జోరందుకుంది. ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్న పలు అభియోగాలపై ఎన్ఐఏ, యాంటీ టెర్రరిస్టు స్క్వాడ్ (ఏటీఎస్), స్థానిక పోలీసు అధికారులతో దర్యాప్తును వేగవంతం చేశారు. మరికొంత మంది ఎన్ఐఏ అధికారులు విజయనగరంలోని పోలీస్ శిక్షణ కళాశాలకు చేరుకున్నారు. రెండోరోజు శనివారం దర్యాప్తులో భాగంగా సిరాజ్ కుటుంబం, అతని స్నేహితుల గురించి ఆరా తీశారు. సిరాజ్ ల్యాప్‌టాప్ లో ఉన్న వివిధ అంశాలపైనా కూపీ లాగుతున్నారు. అందులో డిలీట్ అయిన పలు ఫైళ్లను కూడా తిరిగి ఎక్కడున్నదీ గుర్తించి రీ ఓపెన్ చేసి వాటిని కూడా క్షుణ్ణంగా పరిశీలి స్తున్నారని తెలిసింది. అహిం గ్రూపులో ఎంతమంది సభ్యులు ఉన్నారు? వారు ఏఏ దేశాలు, రాష్ట్రాల్లో ఉన్నారు? అంతర్జాతీయ ఉగ్రవాద సంస్థలతో ఏమైనా సంబంధా లున్నాయా అని కూడా ప్రశ్నించినట్లు తెలిసింది. అహిం గ్రూపు సభ్యులు చత్తీష్‌ఘడ్‌లోనూ విస్తరించినట్లు గుర్తించారు. సిరాజ్ క్రియేట్ చేసిన సిగ్నల్‌యాప్‌లో ఐదు గ్రూపులను గుర్తించినట్లు సమాచారం. ఒక్కోగ్రూపులో ఐదు నుంచి పదిమంది ఉన్నట్లు తెలిసింది. కస్టడీ విచారణలో భాగంగా మహారాష్ట్ర, తమిళనాడుకు చెందిన యాంటీ టెర్రరిస్టు స్క్వాడ్ బృందాలు కూడా విజయనగరం చేరుకున్నాయి.

● సిరాజ్ గత ఏడాది నవంబరు 22న మహారాష్ట్రలోని ముంబయికి వెళ్లినప్పుడు 10 మందితో కలిసి హక్ ఇండియాలో లైవ్ సెషన్‌కు హాజరైనట్లు విచారణలో తేలింది. అక్కడ ఎవరెవరిని కలిశాడు.. అక్కడి నుంచి ప్రణాళిక, పేలుడు సామగ్రి తీసుకువచ్చాడా? అనే దానిపైనా కూపీ లాగుతున్నారు. అదే విధంగా ఈ ఏడాది జనవరి 26న గణతంత్ర దినోత్సవం రోజున ఢిల్లీకి ఏ పనిమీద వెళ్లాడు, అక్కడ ఎవరిని కలిశాడు అని కూడా ప్రశ్నించారని తెలిసింది.

● సిరాజ్, సమీర్‌ల ద్వారా విజయనగరం, దేశంలో ఇతర రాష్ట్రాల్లోనూ భారీ పేలుళ్లు జరపాలని ఐసీస్ లేదా మరో పేరుగాంచిన ఉగ్రవాద సంస్థలు వీరిని ప్రేరేపించినట్లు తెలుస్తోంది. రెండోరోజు దర్యాప్తు సంస్థల అధికారులు ఎక్కువ ఆర్థిక లావాదేవిలు, టెర్రరిస్టు లింక్స్‌పై ఫోకస్ పెట్టినట్లు తెలిసింది.









ఏపీ ప్రభుత్వంపై కనీస మర్యాద కూడా లేని

తెలుగు చిత్ర పరిశ్రమ



- రిటర్న్ గిఫ్ట్ ఇచ్చినందుకు పవన్ కృతజ్ఞతలు
- ఇకపై వ్యక్తిగత చర్చలు ఉండవు.. సినిమా సంఘాల ప్రతినిధులు రావాల్సిందే
- థియేటర్ల బంద్‌పై ఘాటుగా స్పందించిన ఏపీ డిప్యూటీ సీఎం కార్యాలయం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తెలుగు సినిమా రంగానికి పరిశ్రమ హోదా కల్పించి, అభివృద్ధి చేయాలని, ఈ రంగంలో ఉన్నవారి గౌరవమర్యాదలకు భంగం వాటిల్లకుండా చూస్తుంటే - తెలుగు సినీ రంగంలో ఉన్నవారికి ఏపీ ప్రభుత్వం పట్ల కనీస మర్యాద, కృతజ్ఞత కనిపించడం లేదని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ అసహనం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది కావస్తున్నా సీఎం చంద్రబాబును తెలుగు సినిమా సంఘాలు కనీసం ఒకసారైనా మర్యాద పూర్వకంగా కలిశారా? అని ఆయన ప్రశ్నించారు. తెలుగు చిత్ర పరిశ్రమను, అగ్రనటులను గత ప్రభుత్వం ఏ విధంగా ఛీత్కరించుకొని ఇబ్బంది పెట్టిందో తెలుగు చలన చిత్ర వాణిజ్య మండలి, నిర్మాతల మండలి, మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ లాంటి సంఘాలు మరచిపోయినట్లున్నాయని ఆయన గుర్తు చేశారు. పరిశ్రమ ఇచ్చిన రిటన్ గిఫ్ట్‌ను తను తగిన విధంగానే స్వీకరిస్తున్నాని పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు. ఈ రిటర్న్ గిఫ్ట్‌కు అయన కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ మేరకు డిప్యూటీ సీఎం కార్యాలయం ఒక ప్రకటన జారీ చేసింది. జూన్ ఒకటినుంచి థియేటర్ల బంద్ లేదని ఫిల్మ్ ఛాంబర్ ప్రతినిధులు వెల్లడించిన కొద్ది గంటలకే పవన్‌కల్యాణ్ ఈ ప్రకటన విడుదల చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది.

ఆ ఇబ్బందుల్ని మరచిపోయారా?

"రూ.కోట్ల రూపాయల పెట్టుబడులతో రూపొందే చిత్రాలకు అన్ని విధాలా ప్రోత్సహం ఇవ్వడంతో పాటు సృజనాత్మకత ముడిపడిన ఈ వ్యాపారంలో ఉన్నవారి గౌరవ మర్యాదలకు భంగం వాటిల్లకూడదని కూటమి పార్టీలు ఎన్నికలకు ముందు కూడా స్పష్టంగా చెప్పాయి. గత ప్రభుత్వం వ్యక్తులను చూసి పనులు చేసేది, కక్ష సాధింపులకు దిగేది. తమకు నచ్చనివారి సినిమాల విడుదల సమయంలో తహసీల్దార్లను థియేటర్ల దగ్గర నియమించి ఎన్ని ఇబ్బందులు పెట్టిందో నిర్మాతలు మరచిపోతే ఎలా..? ఎన్నికలకు ముందు చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్ చెప్పిన విధంగానే, కూటమి ప్రభుత్వం వ్యక్తులను చూడలేదు. అక్కినేని నాగార్జున కుటుంబానికి చెందిన వారి చిత్రం విడుదలైనప్పుడు ఏపీ ప్రభుత్వం తగిన విధంగా ప్రోత్సహించింది. వ్యవస్థ బాగుండాలి, దానిపై ఆధారపడ్డ వారు ఇబ్బందిపడకూడదు అనేది కూటమి ప్రభుత్వం విధానం. తెలుగు సినిమా రంగం వారు తమ సినిమా విడుదల సమయంలో వ్యక్తిగతంగా వచ్చి అర్జీలు ఇచ్చి, టిక్కెట్ ధర పెంచమని కోరడం ఎందుకు..? అందరూ కలిసి వచ్చి ప్రభుత్వంతో స్పష్టంగా చర్చించమని పవన్ కల్యాణ్ సూచించారు. దిల్‌రాజు, అల్లు అరవింద్, .సురేశ్ బాబు, సుప్రియ, చినబాబు, సి.అశ్వనీదత్, నవీన్ ఎర్నేని తదితర నిర్మాతలు కలిసినప్పుడు అందరూ సంఘటితంగా ఉంటే పరిశ్రమగా అభివృద్ధి చేయవచ్చు అని కూడా తెలిపారు. అయినప్పటికి ఎవరికి వారు వ్యక్తిగతంగా వచ్చి తమ సినిమాలకు టికెట్ ధరలు పెంచమని సినిమాటోగ్రఫీ శాఖకి అర్జీలు ఇస్తూ వచ్చారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తూనే ఉంది" ఏపీ డిప్యూటీ సీఎం కార్యాలయం పేర్కొంది.

సినిమా రంగం కోసం ప్రత్యేక పాలసీ..

ఇక నుంచి వ్యక్తిగత విజ్ఞాపనలు, చర్చలకు తావులేదు. సంబంధిత విభాగం ప్రతినిధులతోనే చర్చిస్తారు. వాటినే సంబంధిత విభాగాలకు పంపిస్తారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పర్యటక రంగానికి పరిశ్రమ హోదా ఇస్తూ పాలసీని ప్రకటించింది. అదే విధంగా సినిమా రంగం అభివృద్ధి కోసం ప్రత్యేక పాలసీ తీసుకురావాలని పవన్ ఆలోచన చేశారు. దీనిపై సీఎంతో చర్చించనున్నారు. అనంతరం కాంప్రహెన్సివ్ ఫిల్మ్ డెవలప్‌మెంట్ పాలసీని ప్రకటిస్తారు.

థియేటర్ల ఆదాయంపై ఆరా

పవన్ కల్యాణ్ పర్యవేక్షణలో సంబంధిత శాఖలతో సినిమా రంగం అభివృద్ధిపై ఇప్పటికే కొన్ని చర్చలు చేశారు. ఇందులో పంపిణీదారులు, ఎగ్జిబిటర్లు ఒక గ్రూపుగా ఏర్పడి చేస్తున్న వ్యవహారాలతో పాటు ప్రేక్షకులు వెచ్చిస్తున్న మొత్తాలు, అందుకు అనుగుణంగా వారు పొందుతున్న సౌకర్యాలు ఎలా ఉన్నాయి. తదితర అంశాలను చర్చించారు. థియేటర్లను సంబంధిత యజమానులు నడపటం లేదని, లీజుదారుల చేతిలోనే అత్యధికంగా ఉన్నాయని అధికారులు తెలిపారు. అయితే లీజుదారుల నుంచి పన్ను సక్రమంగా వస్తుందా లేదా...? కొన్ని చిత్రాలకు టిక్కెటు ధరలు పెంచినప్పుడు ఆ మేరకు పన్ను ఆదాయం పెరిగిందా..? లేదా..? అని కూడా పన్నుల విభాగం పరిశీలన చేయాలని దిశానిర్దేశం చేశారు. రాయలసీమ జిల్లాల్లో థియేటర్ల నుంచి వచ్చే ఆదాయంపైన ఈ సందర్భంగా చర్చించారు. టికెట్ సేల్‌కి, వచ్చే పన్నుకి అంతరం ఏ మేరకు ఉందో చూడాలని నిర్ణయించారు.

రాష్ట్రంలో మల్టీప్లెక్సులు ఎన్ని ఉన్నాయి..?

రాష్ట్రంలో మల్టీప్లెక్స స్థాయి సినిమా హాల్స్ ఎన్ని ఉన్నాయో తెలియచేయాలని ఇప్పటికే సినిమాటోగ్రఫీ శాఖ అధికారులను ప్రభుత్వం నివేదిక అడిగింది. కొన్ని పట్టణాల్లో సింగిల్ థియేటర్లను కూడా రెండు, మూడు స్క్రీన్స్‌గా విభజించి మల్టీప్లెక్స విధానంలో నడుపుతున్నారు. వాటిలో టికెట్ ధరలు, సింగిల్ థియేటర్ టికెట్ ధరలకు ఏమైనా వ్యత్యాసం ఉందా..? కౌంటర్‌లో ఏ ధరకు అమ్ముతున్నారో ఆరా తీస్తున్నారు. విజయవాడ, విశాఖపట్నం, నెల్లూరు, రాజమహేంద్రవరం, గుంటూరు, కాకినాడ, తిరుపతి తదితర నగరాల్లో ఉన్న మల్టీప్లెక్సల నిర్వహణ వాటిలోని టికెట్ ధరలు, ఆహార పదార్థాల ధరలపై కూడా దృష్టిసారిస్తారు.

నైపుణ్యాల పెంపుతోనే పరిశ్రమగా అభివృద్ధి...

కాంప్రహెన్సివ్ ఫిల్మ్ డెవలప్‌మెంట్ పాలసీ ద్వారా రాష్ట్రంలో సినిమా రూపకల్పన నుంచి వాణిజ్యం వరకూ 24 విభాగాల్లో నైపుణ్యాలు పెంపుదల, ఆధునాతన సాంకేతిక వినియోగంపై ప్రత్యేక దృష్టిపెట్టాలని పవన్ కల్యాణ్ భావిస్తున్నారు. పరిశ్రమహోదా కల్పించడంతో పాటు యువతలోనూ, ఇప్పటికే చిత్ర రంగంలో ఉన్న వారికి ఎప్పటికప్పుడు నైపుణ్యాల అభివృద్ధి కోసం - అవసరమైన శిబిరాలు, సెమినార్లు, సింపోజియమ్స్ లాంటివి ఆంధ్రప్రదేశ్‌లో విరివిగా నిర్వహిస్తారు. సినిమా రంగంలో స్టూడియో నుంచి సినిమా హాల్ వరకూ ఉండే విభాగాల్లో గుత్తాధిపత్యం కంటే ఎక్కువ మందికి అవకాశాలు కల్పిస్తేనే, పెట్టుబడులు పెరిగి పరిశ్రమగా వృద్ధి చెందుతుంది. ఈ దిశగానే పవన్ కల్యాణ్ ఆలోచన చేశారు. కాంప్రహెన్సివ్ ఫిల్మ్ డెవలప్‌మెంట్ పాలసీ ద్వారా ఏపీలో సినిమా రంగం అభివృద్ధికి బాటలు వేస్తున్నారు.

అమరావతి, (ఆంధ్రజ్యోతి)

సినీ పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది



ఏపీ సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి దుర్గేష్

సినీ పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంతి దుర్గేష్ అన్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. జూన్ 1 నుంచి సినిమా థియేటర్లు మూసివేయాలన్న ఎగ్జిబిటర్లు, డిస్ట్రిబ్యూటర్ల నిర్ణయంపై ఆరా తీస్తున్నామన్నారు. సినీరంగ పరిశ్రమకు, ప్రభుత్వానికి మధ్య అనుకూల వాతావరణం ఉందన్నారు. సినీ పరిశ్రమ అభివృద్ధి కోసమే నూతన ఫిల్మ్ పాలసీ తెస్తున్నామన్నారు. చిత్ర పరిశ్రమకు, ఎగ్జిబిటర్లకు డిస్ట్రిబ్యూటర్లకు, ప్రొడ్యూసర్‌లకు ఉపయోగపడే విధంగా నిర్ణయాలు తీసుకునేందుకు హోంశాఖ ముఖ్యకార్యదర్శి నేతృత్వంలో విచారణ చేపడుతున్నామన్నారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సినీపరిశ్రమకు చెందిన వారితో ప్రత్యేక సమావేశం నిర్వహించి సమస్యలను ఆరా తీసి పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నామని భరోసా ఇచ్చారని చెప్పారు. 'హరిహర వీరమల్లు' సినిమా విడుదలకు ముందు ఈ తరహా వ్యవహారం దేనికి సంకేతమని మంత్రి ప్రశ్నించారు.

రాజమహేంద్రవరం సిటీ (ఆంధ్రజ్యోతి)

ప్రశ్నించుకోవాల్సిన సమయం వచ్చింది

ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ వ్యాఖ్యలపై, చిత్ర పరిశ్రమలోని పరిస్థితులపై నిర్మాతలు బన్నీవాసు, నాగవంశీ స్పందించారు. "సినీ ఇండస్ట్రీలో రాజకీయాలు చాలా సైలెంట్‌గా.. లోతుగా ఉంటాయి. ఈ రాజకీయాల్లో పరిశ్రమ నలిగిపోతోందనే వాస్తవాన్ని ఇప్పటికైనా నిర్మాతలు, డిస్ట్రిబ్యూటర్లు, ఎగ్జిబిటర్లు గ్రహించాలి. సినిమాల నుంచే వెళ్లి, డిప్యూటీ సీఎం అయిన వారికే మనం ఆగ్రహం తెప్పించామంటే.. మన ఐకమత్యాన్ని ప్రశ్నించుకోవాల్సిన సమయమిది"

\- బన్నీవాసు

"పెద్ద సమస్యలను పరిష్కరించడంపై దృష్టి పెట్టాల్సిన సమయంలో.. అనవసరం లేని సమస్యలను సృష్టించారు. ఇప్పుడు అవే పెరిగి పెద్దవయ్యాయి. విచక్షణతో ఆలోచించి ఉంటే పరిస్థితి దాకా వచ్చేది కాదు.. ఇలాంటి సమస్యలూ వచ్చేవి కావు"

\- నాగవంశీ

థియేటర్ల బంద్ లేదు

- సమస్యల పరిష్కారానికి కమిటీ



'ఏదో ఒక సినిమాను టార్గెట్ చేసి, థియేటర్లను బంద్ చేస్తున్నారు అనే ప్రచారాన్ని ఖండిస్తున్నాం. జూన్ 1 నుంచి థియేటర్ల బంద్ లేదు. ఈ విషయంపై అవసరం వస్తే ప్రభుత్వంతో సైతం చర్చిస్తాం' అని ఫిల్మ్ ఛాంబర్ కార్యదర్శి కేఎల్ దామోదర్ ప్రసాద్ అన్నారు. రెండు తెలుగు రాష్ట్రాలో సింగిల్ స్క్రీన్‌ల బంద్ అంటూ జరుగుతున్న ప్రచారంలో నిజం లేదని ఆయన స్పష్టతనిచ్చారు. థియేటర్ల బంద్ అంశంపై కొన్ని రోజులుగా రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన నిర్మాతలు, డిస్ట్రిబ్యూటర్లు, ఎగ్జిబిటర్లు మధ్య చర్చలు కొనసాగుతున్నాయి. వీరంతా ఫిల్మ్ ఛాంబర్ ఆధ్వర్యంలో శనివారం ఉమ్మడిగా సమావేశమై కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా దామోదర్ ప్రసాద్ మాట్లాడుతూ 'జూన్ 1 నుంచి థియేటర్ల బంద్ జరగడం లేదు. ఈ నెల 30న ఈసీ మీటింగ్ ఉంటుంది. ఆ రోజు మూడు విభాగాల సభ్యులతో కమిటీ వేయబోతున్నాం. తద్వారా ఈ సమస్యకు నిర్ణీత సమయంలో పరిష్కారం వచ్చే అవకాశం ఉంది. చిత్ర పరిశ్రమ కష్టాలను బయట వారెవ్వరూ తీర్చరు. స్వయంగా పరిశ్రమే అందులో నుంచి బయటపడుతుంది' అని చెప్పారు.

మంచి మాస్ రోల్ చేశాను

బెల్లంకొండ సాయి శ్రీనివాస్



"నన్ను ఇష్టపడే ప్రతి ప్రేక్షకుడి కోసం 'భైరవం' చిత్రం చేశాను. భావోద్వేగాలతో పాటు వాణిజ్యహంగులు కలబోసిన చిత్రం ఇది. చాలా ఏళ్ల తర్వాత మళ్లీ బలమైన మాస్ పాత్రని చేశాను. మంచి థియేట్రికల్ ఎక్స్‌పీరియన్స్ ఇచ్చే సినిమా ఇది. వంద శాతం వినోదాన్ని పంచుతుంది. తప్పకుండా అందరికీ నచ్చుతుంది" అని బెల్లంకొండ సాయి శ్రీనివాస్ అన్నారు. ఆయన కథానాయకుడిగా విజయ్ కనకమేడల దర్శకత్వం వహించిన చిత్రమిది. కేకే రాధామోహన్ నిర్మించారు. ఈనెల 30న విడుదలవుతోంది. ఈ సందర్భంగా సాయి శ్రీనివాస్ మీడియాతో ముచ్చటించారు.

- 'భైరవం' చిత్రంలో పాత్రల తాలూకు భావోద్వేగాలను ప్రేక్షకులు అనుభూతి చెందుతారు. ఈ సినిమాలో హీరో కొలిచేది కాలభైరవుణ్ణి. అలా కథలో నుంచే 'భైరవం' టైటిల్ వచ్చింది. సరికొత్త అంశాలతో వినూత్న కథాంశంతో సాగుతుంది. గ్రామీణ నేపథ్యంలో మాస్ అంశాలతో ఓ సినిమా చేయాలనుకుంటున్న తరుణంలో 'భైరవం' కథ నా దగ్గరకు వచ్చింది. నాకు బాగా నచ్చింది. కథ విని ఉద్వేగానికి లోనయ్యా. పల్లె వాతావరణంలో రూపొందిన ఈ చిత్రం తప్పకుండా ప్రేక్షకులను అలరించే విధంగా ఉంటుంది. దర్శకుడు విజయ్‌తో పని చేయడం మంచి అనుభవం. ప్రేక్షకుల అభిరుచికి తగ్గట్లు పలు మార్పులు చేసి సినిమాను అద్భుతంగా తీర్చిదిద్దారు. ఆయన మార్క్ బలంగా కనిపిస్తుంది. ప్రతి సన్నివేశం మనసులో నిలిచిపోయేలా ఉంటుంది. ముఖ్యంగా పతాక ఘట్టాలే సినిమాకు హైలెట్. సినిమా చూశాక విజయ్ కథకు తన పరిధిలో పరిపూర్ణంగా న్యాయం చేశారనే ఫీలింగ్ కలిగింది. వినోద భరితంగా నడిపిస్తూనే భావోద్వేగభరితంగా ఆవిష్కరించే ప్రయత్నం చేశారు. పోరాట ఘట్టాలు చాలా బావుంటాయి.
- నారా రోహిత్, మంచు మనోజ్ పాత్రలు కథలో చాలా కీలకం. అందరికీ గుర్తుండిపోయేలా వారి పాత్రలను దర్శకుడు తీర్చిదిద్దారు. డిఫరెంట్ షేడ్స్ ఉన్న పాత్రల్లో వారిద్దరూ అలరిస్తారు. అదితీ శంకర్ వెరీ నైస్ పర్సన్. నటనలో తనదైన శైలీ, హావభావాలతో మెప్పిస్తుంది. అలాగే తను మంచి సింగర్, డాన్సర్ కూడా. ఈ సినిమాతో ఆమె ప్రతిభకు తగ్గ గుర్తింపు దక్కుతుంది. శ్రీచరణ్ పాకాల అద్భుతమైన సంగీతం ఇచ్చారు. పాటలకు మంచి స్పందన లభిస్తోంది. రాధామోహన్ గారు నాకు చాలా ఇష్టమైన ప్రొడ్యూసర్. హీరోగా నాకు చక్కటి సంతృప్తిని మిగిల్చే సినిమా ఇచ్చారు. ప్రస్తుతం 'హైందవ', 'టైసన్ నాయుడు', 'కిష్కింధపురి' చిత్రాలు చేస్తున్నాను.

నిర్వహణ లేక.. సాగుకు నీరందక

- శిథిలావస్థకు చేరిన మదుములు
- పిచ్చిమొక్కలు పెరిగిన వైనం
- ఇదీ పెదకృష్ణరాజపురంలోని వెంకటరమణ చెరువు పరిస్థితి



పిచ్చిమొక్కలతో నిండిపోయిన చెరువు గర్భం

వేపాడ, మే 24 (ఆంధ్రజ్యోతి): పెదకృష్ణరాజపురంలోని వెంకటరమణ చెరువు నిర్వహణ లేకపోవడంతో ఆయకట్టుకు నీరందడంలేదు. ప్రధానంగా మదుములు శిథిలావస్థకు చేరడంతో ఖరీఫ్‌లో సైతం పూర్తిస్థాయిలో నీరందంలేదని రైతులు వాపోతున్నారు. దీనికితోడు పిచ్చిమొక్కలు పెరగడంతో నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోయింది.

మండలంలోని పెదకృష్ణరాజపురం రెవెన్యూలో 100 ఎకరాల్లో విస్తరించి ఉన్న వెంకటరమణ చెరువు పరిధిలో సుమారు 600 ఎకరాల ఆయకట్టుఉంది. ఈ చెరువుకు మూడు చోట్ల మదుములు ఏర్పాటుచేశారు. ఇందులో రెండు పూర్తి శిథిలావస్థకు చేరడంతో చెరువులో చుక్కనీరు లేకుండాపోతోంది. చెరువు పూర్తిగా నిండిన తర్వాత మిగులు జలాలు బయటకు వెళ్లిపోయేందుకు వీలుగా ఏర్పాటుచేసిన చెక్‌డ్యామ్ కూడా శిథిలావస్థకు చేరుకుంది. 600 ఎకరాలకు సాగునీరందించే చెరువు పిచ్చి మొక్కలతో నిండిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. చెరువు మరమ్మతులపై ప్రజా ప్రతినిధులు, జలవనరులశాఖ అధికారులు దృష్టిసారించడం లేదని పొడుపురెడ్డి కృష్ణ, తదితర రైతులు వాపోతున్నారు.



చెరువు మదుము వద్ద గండి పడిన దృశ్యం

నేడు రారవే సమావేశం

రాజాం, మే24 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీకాకుళం రోడ్డులో రాజాం రచయితల వేదిక (రారవే) 124వ సమావేశం ఆదివారం నిర్వహించనున్నట్లు రచయితల వేదిక నిర్వాహకుడు గార రంగనాథం ఒక ప్రకటనలో తెలిపారు. ఈసందర్భంగా బెహరా రామకృష్ణ రచించిన నలచరిత్ర అన్న ప్రబంధాన్ని విజయనగరానికి చెందిన డాక్టర్ ఎ.గోపాలరావు ఆవిష్కరిస్తారని పేర్కొన్నారు. సమావేశంలో గ్రంథాన్ని విశ్రాంతి డిగ్రీ కళాశాల ఉపన్యాసకులు మేడూరి సూర్యసత్యానారాయణ మూర్తి పరిచయం చేస్తారని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

డెంకాడ, మే 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతలవలస, బెటాలియన్, రఘుమండ, గుండాలపేట, బొడ్డవలస, కృష్ణాపురం, వెలమపేట, గెద్దవానిపాలెం, జొన్నాడు, అకులపేట, డి.తాళ్లవలస, దువ్వపేట, సత్యనారాయణపురం, చెల్లూరు ఇండస్ట్రియల్ ఏరియాల్లో ఆదివారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని ఈఈ జి.సురేష్‌బాబు ఒకప్రకటనలో తెలిపారు. విద్యుత్‌లైన్ అభివృద్ధి పనుల దృష్ట్యా సరఫరాను నిలిపివేయనుండడంతో వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు ప్రారంభోత్సవాలు

శృంగవరపుకోట, మే 24(ఆంధ్రజ్యోతి): ఎస్.కోట నియోజకవర్గంలో ఆదివారం విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్, ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నారు.తొలుత లక్కవరపుకోట మండలంలోని గేదెలవానిపాలెంలో బ్రిడ్జి, సీసీ రోడ్డు, వేపాడమండలం వీలుపర్తిలో గ్రామ సచివాలయం, ఆర్బీకే, పాటూరులో నిర్మించిన ఆర్బీకే ప్రారంభించనున్నారు. మధ్యాహ్నం ఎస్.కోట మండలం బొడ్డవర నుంచి చిట్టింపాడు వరకు నిర్మించనున్న రోడ్డు నిర్మాణానికి, ఎస్.కోట ప్రభుత్వ డిగ్రీ కళాశాల అనుబంధ మహిళ వసతిగృహం నిర్మాణానికి భూమిపూజచేస్తారు. అనంతరం ఎల్.కోట ఎమ్మెల్యే నివాసంలో సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ చేయనున్నారు. మధ్యాహ్నం జామి మండలంలోని తానవరంలో నిర్మించనున్న వంతెనకు, రామభద్రపురం అగ్రహారం రోడ్డుకు భూమి పూజ చేయనున్నారు.

నేడు జేవీవీ జిల్లా మహాసభ

విజయనగరం బాబామెట్ట, మే 24 (ఆంధ్రజ్యోతి): విజయనగరంలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఆదివారం జన విజ్ఞాన వేదిక జిల్లా మహాసభలు నిర్వహించనున్నట్లు ఆ సంస్థ నగరఅధ్యక్షుడు శివాజీ ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమాన్ని గిరిజన కార్పొరేషన్ ఛైర్మన్ డాక్టరు డీవీజీ శంకరరావు ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. జడ్పీ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావుతో పాటు పలువురు జన విజ్ఞాన వేదిక ప్రతినిధులు, కవులు, రచయితలు, మేధావులు హాజరుకానున్నారని తెలిపారు.

సారా రహిత గ్రామాలుగా దేవుని కణపాక, ఫకీరు కిత్తలి

నెల్లిమర్ల, మే 24 (ఆంధ్రజ్యోతి): నెల్లిమర్ల ఎక్సైజ్‌స్టేషన్ పరిధిలోని గుర్ల మండలంలోని దేవుని కణపాక, ఫకీరు కిత్తలి గ్రామాలను సారా రహిత గ్రామాలుగా తీర్మానించినట్లు సీఐ ఎం.వెంకటరావు తెలిపారు. ఆయా గ్రామాల సర్పంచ్‌లు పీఎస్ఎన్ రాజు,ఆర్.స్వామినాయుడు ఆధ్వర్యంలో ప్రజల సమక్షంలో తీర్మానాలను చేసినట్లు చెప్పారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న నవోదయం 2.0కార్యక్రమం ద్వారా ఎ, బి కేటగిరిలుగా ఉన్న దేవుని కణపాక, ఫకీరు కిత్తలి గ్రామాలను సారా రహిత గ్రామాలుగా తీర్మానం చేయడం శుభపరిణామమని తెలిపారు. కార్యక్రమంలో ఎం.అప్పారావు, సిబ్బంది పాల్గొన్నారని తెలిపారు.

తోటల పెంపకాన్ని ప్రోత్సహించాలి

రేగిడి, మే 24 (ఆంధ్రజ్యోతి): పండ్ల తోటల పెంపకానికి పెద్దఎత్తున ప్రోత్సహించాలని డ్వామా క్లస్టర్‌లెవెల్ కోర్స్ డైరెక్టర్ కె.చిన్నంనాయుడు సూచించారు. శనివారం రేగిడి ఉపాధికార్యాలయంలో పథకం ప్రగతి, లక్ష్యాలపై సిబ్బందితో సమీక్షించారు. ఉపాధి హామీ పథకానికి అనుబంధంగా అమలుచేస్తున్న ఫాంపొండ్లు, సోప్ పిట్స్, కంపోస్టు పిట్స్, పండ్లతోటలు పెంపకాల్లో సిబ్బంది లక్ష్యాలుచేరుకోవాలని కోరారు. చిన్న, సన్నకారు రైతులను గుర్తించి వీటి ప్రయోజనాలపై చైతన్యం తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో-1, 2లు హరనాథ్, శ్రీనివాసరావు, జేఈ మురళి పాల్గొన్నారు.

అర్హులను ఆదుకుంటాం: ఎమ్మెల్యే



సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే లోకంనాగమాధవి

భోగాపురం,మే24(ఆంధ్రజ్యోతి):ప్రభుత్వంఅర్హులైన వారిని అన్నివిధాలా ఆదుకుంటుదని నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకంనాగ మాధవి తెలిపారు. శనివారం ముంజేరులోని జనసేన పార్టీ కార్యాలయంలో నెల్లిమర్ల నియోజకవర్గంలో అనారోగ్యంతో బాధపడుతున్న నలుగురికి ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన రూ.4.73 లక్షలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాధితులకు సకాలంలో ఆర్థిక సహాయం అందించడం ద్వారా ప్రభుత్వం ఆరోగ్య సంక్షేమానికి అంకితమయ్యిందన్నారు. కాగా పూసపాటిరేగ మండలంలోని తిప్పలవలసకు చెందిన 100 మంది వైస్ సర్పంచ్ కేశం అరుణ ఆధ్వర్యంలో ముంజేరు పార్టీ కార్యాలయంలో లోకంనాగమాధవి సమక్షంలో జనసేనలో చేరారు. కార్యక్రమంలో కేశం అమర్నాథ్, జయరాజు, శివ పాల్గొన్నారు.

నిందితులపై చర్యలు తీసుకోవాలి

నెల్లిమర్ల, మే 24 (ఆంధ్రజ్యోతి): జనసేన కార్యకర్తలపై దాడిచేసిన నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే లోకం నాగమాధవి డిమాండ్‌చేశారు. మండలంలోని కొత్తపేటలో వైసీపీ, జనసేన వర్గీయుల మధ్య జరిగిన కొట్లాటలో గాయపడి మిమ్స్‌లో చికిత్సపొందుతున్న జనసేన కార్యకర్తలను ఎమ్మెల్యే లోకం నాగమాధవి శుక్రవారం రాత్రి పరామర్శించారు. ఈ ఘటనలో ఆ గ్రామానికి చెందిన జనసేననాయకులు సువ్వాని రమణతోపాటు మరో ముగ్గురు గాయపడ్డారు. అలాగే జనసేననాయకులు చనమల్లు వెంకటరమణ, కరుమజ్జి గోవిందరావు,అంబళ్ల అప్పలనాయుడు, యడ్ల గోవిందరావు క్షతగాత్రులను పరామర్శించారు.

మాస్టర్‌ప్లాన్‌పై అభ్యంతరాలు తెలియజేయండి

- విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య

విజయనగరం రింగురోడ్డు, మే 24 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం మెట్రో పాలిటిన్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ (వీఎంఆర్‌డీఏ) గతంలో రూపొందించిన మాస్టర్‌ప్లాన్‌పై ప్రజల నుంచి అభ్యంతరాలు, సూచనలు కోరుతూ సూచిక బోర్డులు ఏర్పాటుచేసినట్లు నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం జీవో-136 ఎంఏయూడీ 2021, నవంబరు ఎనిమిదో తేదీన విడుదల చేసిన బృహత్తర ప్రణాళికను ఆమోదించినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం వీఎంఆర్‌డీఏ పరిధిలో ఉన్న పట్టణాలు, గ్రామాలకు బృహత్తర ప్రణాళిక- 2041 ఆమోదించే నిమిత్తం ప్రజాభిప్రాయాన్ని కోరుతున్నట్లు తెలిపారు. వీఎంఆర్‌డీఏ కమిషనర్ కేఎస్ విశ్వనాథన్ అందించిన వివరాల ప్రకారం 2041 బృహత్తర ప్రణాళికపై పునః పరిశీలన చేసేందుకు ప్రతిపాదించడంతో సదరు ప్లాన్‌పై అభ్యంతరాలు, సలహాలపై ప్రజల నుంచి కోరుతున్నట్లు పేర్కొన్నారు. ఈనెల 22 నుంచి జూన్ 21 వరకూ ప్రజలు తమ అభిప్రాయాలు, సూచనలను రాత పూర్వకంగా స్వయంగా గాని పోస్టుద్వారా విశాఖలోని వీఎంఆర్‌డీఏ కార్యాలయానికి తెలియజేయాలని కోరారు.

యశ్వంత్‌కుమార్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

లక్కవరపుకోట, మే 24(ఆంధ్రజ్యోతి): కోరుకొండ సైనిక్ పాఠశాల నిర్వహించిన ఎంట్రన్స్ టెస్టులో మొదటి ర్యాంకు సాధించిన పోతంపేటకు చెందిన జి.యశ్వంత్‌కుమార్‌ను ఆదర్శంగా తీసుకోవాలని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి కోరారు.ఈ మేరకు శనివారం యశ్వంత్‌కుమార్‌ను అభినందించారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి చెందాలి

- టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్‌మల్లిక్‌నాయుడు



మాట్లాడుతున్న రామ్‌మల్లినాయుడు

మెరకముడిదాం, మే 24(ఆంధ్రజ్యోతి):మహిళలు ఆర్థికాభివృద్ధి చెందడానికి ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాలు, పథకాలు ప్రవేశపెడుతోందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్‌మల్లిక్‌నాయుడు తెలిపారు. శనివారం మండలంలోని గర్భాం గ్రామ సచివాలయంలో ఏపీబీసీ సహకార ఆర్థిక సంస్థ మంజూరు చేసిన ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన కుట్టు మిషన్ శిక్షణ కార్యక్రమాన్ని మహిళలంతా సద్వినియోగంచేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షులు తాడ్డి సన్యాసినాయుడు, టీడీపీ నాయకులు తాడ్డి చంద్రశేఖర్, కోట్ల మోతీలాల్ నాయుడు, రమణ మోహనరావు, పి.సన్యాసినాయుడు, సర్పంచ్ గాబ్రియేలు, ఎంపీడీవో జి.భాస్కరరావు, ఈవోపీఆర్‌డీ విశ్వనాథం పాల్గొన్నారు.

స్పెషల్ పోస్టులు మంజూరు చేయాలి

- ఎస్‌టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు జోగారావు



మాణిక్యంనాయుడికి వినతిపత్రం అందిస్తున్న ఎస్‌టీఎఫ్ నాయకులు

విజయనగరం రూరల్, మే 24 (ఆంధ్రజ్యోతి):గిరిజన ప్రాంతాల్లో పనిచేసిన ఉపాధ్యాయులకు స్పెషల్ పోస్టులు మంజూరు చేయాలని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం(ఎస్‌టీఎఫ్) జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.జోగరావు, చిప్పాడ సూరిబాబు డిమాండ్‌చేశారు.విజయనగరంలో డీఈవో మాణిక్యం నాయుడుకు ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్వీసు పాయింట్లలో ఆరు డెసిమల్స్ వచ్చే విధంగా సరిచేయాలన్నారు. ప్రమోషన్ కల్పించిన తరువాతే, ఎస్‌జీటీలకు కౌన్సెలింగ్ నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

వయస్సు నిర్ధారణ పత్రాలు అందించడి

శృంగవరపుకోట, మే 24 (ఆంధ్రజ్యోతి) గ్రామ, వార్డు సచివాలయాల్లో వృద్ధులకు వయస్సు నిర్ధారణ పత్రాలు అందించేలా కృషి చేయాలని జనజాగృతి సంస్థ ఉత్తరాంధ్ర కన్వీనర్ శీరాపు శ్రీనివాసరావు కోరారు. ఈమేరకు శనివారం ఎస్.కోటలో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజును వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వృద్ధుల్లో కొందరికి 60 సంవత్సరాలు దాటి ఉన్నప్పటికి ఆధార్ కార్డుల్లో తక్కువ వయస్సునమోదు కావడంతో వృద్ధాప్య పింఛన్‌ను పొందలేకపోతున్నారన్నారు. జిల్లాలో 3,300 మందికి వయస్సు నిర్ధారణ పత్రాలు మంజూరు చేయాల్సిఉందని, జిల్లా జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ వీటిని ఇచ్చేందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు.



రఘురాజుకు వినతిపత్రం అందజేస్తున్న శ్రీనివాసరావు

రాష్ట్రంలో శాంతి భద్రతలు లేవు

- శాసనమండలిలో ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ బొత్స

విజయనగరం, మే 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో శాంతి భద్రతలు లేవని, సంబంధం లేని వ్యక్తులను కేసుల్లో ఇరికిస్తున్నారని శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ విమర్శించారు. విజయనగరంలో ఆయన శనివారం విలేకర్లతో మాట్లాడారు.సంబంధంలేని వ్యక్తులను కేసుల్లో ఇరికించి ఇబ్బంది పెడుతున్నారని, రాష్ట్రంలో శాంతి భద్రతలు రాను రాను క్షీణిస్తున్నాయని అన్నారు. సూపర్ సిక్స్ గురించి గత ఎన్నికల ముందు కూటమి నాయకులు వాడవాడలా చెప్పుకొచ్చారని, సూపర్ సిక్స్ ఏడాది కాలంలో ఫ్లాప్ అయ్యిందని విమర్శంచారు. ఉపాధి హామీ కూలీలకు 6 ,7 వారాల నుంచి డబ్బులు ఇవ్వడం లేదని, రూ.లక్షా 35వేల కోట్లు అప్పు తెచ్చిన ప్రభుత్వం కూలీలకు డబ్బులు ఇవ్వలేదా అని ఎద్దేవా చేశారు. రాష్ట్రానికి కోట్లలో పెట్టుబడులు తెస్తున్నట్టు ప్రకటనలు చేస్తున్నారని, ఏడాదిలో ఇంతవరకూ ఎంత పెట్టుబడి తెచ్చారని ప్రశ్నించారు.

ఎల్.కోట మండల సమావేశంలో వాగ్వాదం

లక్కవరపుకోట, మే 24(ఆంధ్రజ్యోతి): ఎల్.కోట మండల సమావేశంలో వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ సమావేశానికి మొత్తం తొమ్మిది మంది సర్పంచ్‌లు, ఎంపీటీసీల కుటుంబ సభ్యులు హాజరయ్యారు. ఎంపీటీసీలు బొడ్డు గణపతి, ఎడ్ల కిశోర్‌కుమార్, బొమిరెడ్డ స్వామినాయుడు, సర్పంచ్‌లు ఆదిరెడ్డి అర్జున్, ఎం.భాస్కరరావు మాత్రమే పాల్గొన్నారు. మహిళా ప్రజాప్రతినిధుల స్థానంలో హాజరైన భర్తలు సభలో గలాట సృష్టించడం విశేషం.శనివారం ఎంపీపీ గేదెల శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన మండల సమావేశంలో తలారి సర్పంచ్ భర్త గుమ్మడి ప్రసాద్ సమస్యలను సభ దృష్టికి తీసుకొచ్చారు. ఆయనపై కొత్యాడ సర్పంచ్ దేవీ భర్త మహేష్, జమ్మాదేవిపేట సర్పంచ్ సత్యవతి కుమారుడు కిరణ్, జమ్మాదేవిపేట ఎంపీటీసీ శ్యామల తండ్రి ఆవాల సత్యనారాయణ, చందులూరు ఎంపీటీసీ యడ్ల కిశోర్ తిరగబడ్డారు. టీడీపీ నేతలు అడ్డగోలుగా పనులు చేస్తున్నారని వైసీపీ వారి బిల్లులు ఆపేస్తున్నారని విమర్శలకు దిగారు. ప్రతిసారి నీవే అడ్డు తగులుతున్నావని తీవ్రమైన స్వరంతో టీడీపీ సభ్యుడు ప్రసాద్‌తో వాగ్వాదానికి దిగారు. ఆ సమయంలో సభలో టీడీపీ సభ్యులెవరూ లేకపోవడంతో ప్రసాద్ ఒంటరి పోరాటం చేయాల్సివచ్చింది. కార్యక్రమంలో ఎంపీడీవో ఎస్.అప్పారావు పాల్గొన్నారు.

28 నుంచి స్పెషల్ కేటగిరీ విద్యార్థులకు కౌన్సెలింగ్

నూజివీడు టౌన్, మే 24(ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లా నూజివీడులోని రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ అండ్ టెక్నాలజీ పరిధిలోని ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లలో ఇంటిగ్రేటెడ్ ఇంజనీరింగ్‌లో అడ్మిషన్లకు సంబంధించి సర్టిఫికెట్ వెరిఫికేషన్ కార్యక్రమం 28వ తేదీ నుంచి ప్రారంభిస్తున్నట్టు ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్, నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్ డైరెక్టర్ ఎస్. అమరేంద్రకుమార్ తెలిపారు. నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో క్యాప్, బీఎస్సీ, ఎన్ఎస్ఎస్ స్పోర్ట్స్, తదితర స్పెషల్ కేటగిరీకి సంబంధించిన ఈ నెల 28వ తేదీ నుంచి 31 వరకు సర్టిఫికెట్ వెరిఫికేషన్ కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు.

కార్యకర్తల సంక్షేమమే ధ్యేయం

- టీడీపీ సీనియర్ నాయకుడు సువ్వాడ రవిశేఖర్



మాట్లాడుతున్న రవిశేఖర్

నెల్లిమర్ల, మే 24 (ఆంధ్రజ్యోతి): కార్యకర్తల సంక్షేమమే తమ ధ్యేయమని టీడీపీ సీనియర్ నాయకుడు, విశాఖ ఉత్తర నియోజకవర్గ పరిశీలకుడుసువ్వాడ రవిశేఖర్ తెలిపారు.శనివారం నెల్లిమర్లలోని టీడీపీ కార్యాలయంలో పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు కడగల ఆనంద్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో రవిశేఖర్ మాట్లాడారు. సమావేశంలో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి గేదెల రాజారావు, జిల్లా కార్యదర్శి లెంక అప్పలనాయుడు,పార్టీ నాయకులు బొంతు వెంకటరమణ, అట్టాడ శ్రీధర్, రెడ్డి వేణు, అవనాపు సత్యానారాయణ, ఆదినారాయణ పాల్గొన్నారు.

మహానాడును విజయవంతంచేయాలి

విజయనగరం దాసన్నపేట, మే 24 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లాలో ఈనెల 27, 28, 29 తేదీల్లో జరగనున్న మహానాడును జిల్లాలోని శిష్టకరణ కుటుంబ సభ్యులు హాజరై జయప్రదం చేయాలని రాజాం పట్టణ ఉపాధ్యక్షులు ఊరిటి సురేంద్ర, జిల్లా శిష్టకరణ సంఘం అధ్యక్షులు ఎంపీజీ గౌరీశ్వరరావు పిలుపునిచ్చారు. శనివారం విజయనగరంలోని గుంటూరు వారువీధిలోని బృందావనం అపార్టుమెంటు కార్యాలయ ఆవరణలో ఏర్పాటుచేసిన సమావేశంలో సంఘ ప్రతినిధులు వెంకటేష్, గోవిందా, సంజీవరావు, వెంకట రమణారావు, మధుసూదనరావు పాల్గొన్నారు.

బండమ్మ తల్లి పండుగకు సన్నాహాలు

శృంగవరపుకోట, మే 24 (ఆంధ్రజ్యోతి):ఎస్.కోట శివారు సీతంపేటలో 14 ఏళ్ల తర్వాత బండమ్మతల్లి పండుగ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం పండుగకు సంబంధించిన చాటింపు వేశారు. ఆలయం వద్ద పూజలు నిర్వహించిన అనంతరం గ్రామమంతా తిరిగారు. ఈనెల 31న తొలేళ్లు, జూన్ 1న అనుపు ఉత్సవాన్ని నిర్వహించనున్నారు. కమిటీ సభ్యులు యలమంచిలి ఈశ్వరరావు, చిప్పాడ రమణ, చింతల నారాయణమూర్తి, నాగరాజు, అప్పల సత్యం తదితరుల ఆధ్వర్యంలో భక్తుల కోసం ఏర్పాట్లు చేస్తున్నారు.

జూన్ 1న ఉచిత మోడల్ లాసెట్ పరీక్ష

గుంటూరు(తూర్పు), మే 24(ఆంధ్రజ్యోతి): ఏపీ బీసీ అడ్వకేట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జూన్ 1వ తేదీన రాష్ట్రస్థాయి ఉచిత మోడల్ లాసెట్ పరీక్ష నిర్వహిస్తున్నట్టు అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నక్కా శీనయ్య, కార్యదర్శి నక్కల నాగరాజు యాదవ్, కన్వీనర్ రవి తెలిపారు. గుంటూరులో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గుంటూరు, శ్రీకాకుళం, నెల్లూరు. తిరుపతి, అనంతపురంలో పరీక్ష నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. పేర్లు నమోదు కోసం ఆయా జిల్లాల అభ్యర్థులు గుంటూరు- 82974 83785, నెల్లూరు- 99898 50670, తిరుపతి- 94408 10266, అనంతపురం- 94418 88834, శ్రీకాకుళం- 96407 80728 అనే నెంబర్‌లలో సంప్రదించాలని సూచించారు.

రెండు కేజీల గంజాయి స్వాధీనం

వేపాడ, మే 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాటూరు మెయిన రోడ్డులో వాహనాల తనిఖీలో భాగంగా రెండు కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు వల్లంపూడి ఎస్ఐ సుదర్శన్ తెలిపారు. అరకు నుంచి విశాఖ వెళ్తున్న తెలంగాణకు కారులో గంజాయి పట్టుబడిందని చెప్పారు.ఈ మేరకు తహసీల్దార్ రాములమ్మ సమక్షంలో గంజాయిని తూకం వేసి స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఆ కారులో ఉన్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ సుదర్శన్ చెప్పారు.

పోక్సో కేసు నమోదు

భామిని, మే 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికపై అదే గ్రామానికి చెందిన కరణం తిరుపతిరావు అనే వ్యక్తి అత్యాచారానికి పాల్పడడంతో పోలీసులు ఆయనపై పోక్సో కేసు నమోదు చేశారు.బత్తిలి ఎస్ఐ జి.అప్పారావు శనివారం తెలిపిన కథనం మేరకు.. గురువారం రాత్రి బాలిక ఇంట్లో టీవీ చూస్తుండగా తిరుపతిరావు అఘాయిత్యానికి పాల్పడ్డాడు. దీంతో తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. తిరుపతిరావును అదుపులోకి తీసుకుని శనివారం కొత్తూరు మేజిస్ట్రేట్ ముందు హాజరు పరచగా, 14 రోజులు రిమాండ్‌కు తరలించారు.

బస్సెక్కుతూ జారిపడి వృద్ధుడికి గాయాలు

రాజాం రూరల్, మే 24 (ఆంధ్రజ్యోతి): రాజాం మెయిన్‌రోడ్‌లో కంచరాం వెళ్లేందుకు శనివారం బస్సెక్కుతూ ఓ వృద్ధుడు జారిపడి తీవ్రంగా గాయపడ్డాడు. ఎస్ఐ రవికిరణ్ కథనం మేరక..మండలంలోని కంచరాం గ్రామానికి చెందిన కంచర్ల అప్పలరాజు రాజాంలో సరుకుల కొనుగోలు వచ్చి తిరిగి ఇంటికి వెళ్లేందుకు సరుకుల మూటతో బస్సెక్కే ప్రయత్నం చేశాడు. ఇదే సమయంలో బస్సును ముందుకు కదలడంతో బస్సు మెట్ల పైనుంచి ఒక్కసారిగా రోడ్డుపై పడి తీవ్ర గాయపడ్డాడు. కండక్టర్ సహాయంతో రాజాం సామాజిక ఆసుపత్రిలో ప్రథమచికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం శ్రీకాకుళం తరలించారు. కంచర్ల ఈశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ రవికిరణ్ కేసు నమోదు చేశారు.

స్తంభాన్ని ఢీకొట్టిన ట్రాక్టర్

- కృష్ణంవలసలో తప్పిన పెనుప్రమాదం



విరిగిన విద్యుత్ స్తంభం

సంతకవిటి, మే 24 (ఆం ధ్రజ్యోతి: మండలంలోని కృష్ణంవలసలో దిగువ వీధిలో శనివారం మధ్యాహ్నం ఇటుకల లోడ్ వస్తున్న ట్రాక్టర్ విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. తక్షణమే గ్రామస్థులు ట్రాన్స్ ఫార్మర్ నుంచి సరఫరా నిలిపి వేయడంతో పెను ప్రమాదం తప్పింది. గ్రామస్థుల కథనం మేరకు.. మొదటి ఓ స్తంభాన్ని ట్రాక్టర్ ఢీకొనగా,అదే మార్గంలో ఉన్న మూడు స్తంభాలు విరిగి నేలపై పడిపోగా, మరో స్తంభం పక్కకు ఒరిగిపోయింది. స్తంభాలపై ఉన్న విద్యుత్ వైర్లు ఇళ్లకు వీధిలో పడ్డాయి.దీంతో ట్రిప్ కావడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.వెంటనే గ్రామస్థులు ట్రాన్స్ ఫార్మర్ నుంచి సరఫరా నిలిపివేశారు. స్తంభాలకు ట్రాక్టర్ ఢీకొన్న వెంటనే గ్రామస్థులు ఇళ్ల నుంచిబయటకు పరుగులు తీశారు. అయితే ట్రాక్టర్‌పైన డ్రైవర్‌తోపాటు ఆవీధిలో ఉన్న వారికి ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో గ్రామస్థులంతా ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటన వల్ల విద్యుత్ శాఖకు రూ.70 వేలు నష్టం వాటిల్లిందని ఎలక్ట్రికల్ ఏఈ వినయ్‌కుమార్ తెలిపారు.

కోళ్ల ఫారం తొలగించాలి

- బి.రసాడవలసలో ఐదు గ్రామాల బాధితుల ఆందోళన



కోళ్ల ఫారం ఎదుట ఆందోళన చేస్తున్న బాధితులు

మెంటాడ, మే 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బి.రసాడవలస గ్రామానికి ఆనుకుని ఉన్న కోళ్ల ఫారాన్ని తొలగించాలని గదబవలస, చింతలవలస, కైలాం, అమరాయివలస,బి.రసాడవలస గ్రామాల ప్రజలు కోళ్ల ఫారం ఎదుట శనివారం ఆందోళన చేపట్టారు. తొలగించే వరకూ కదిలేది లేదని సిబ్బంది, కూలీలను లోపలికి వెళ్లనీయకుండా అడ్డుకున్నారు.ఈ సందర్భంగా బాధిత గ్రామాల ప్రజలు మాట్లాడుతూ ఐదేళ్ల కిందట ఏర్పాటుచేసిన కోళ్లఫారం వల్ల తామంతా దుర్వాసనతో అవస్థలకు గురవుతున్నామని వాపోతున్నారు. కోళ్లఫారం వ్యర్థాలను గుంతలోకి తరలిస్తున్నారని, దీంతో ఊట వల్ల గుంతను ఆనుకుని వున్న సుమారు 100 ఎకరాల పంటలు దెబ్బతింటుందని తెలిపారు. కోళ్లఫారం ఊట చేరి దగ్గరలోని అనంతసాగరంలోని చేపలు చనిపోతున్నాయని మత్స్యకారులు వాపోయారు. ఏసీ కోళ్ల ఫారం కావడంతో ఎవరికీ ఇబ్బంది ఉండదని అప్పట్లో తమను నమ్మించారని, అధికారులు సైతం నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు మంజూరు చేశారని తెలిపారు. యాజమాన్యం తక్షణమే కోళ్ల ఫారం తొలగించకపోతే ఆ పని తామే చేయాల్సి వుంటుందని తేల్చి చెప్పారు. దీంతో కోళ్ల ఫారం యాజమాన్యం పంపిన ప్రతినిధులు ఆందోళనకారులతో చర్చలు జరిపారు. వచ్చే నెల ఐదో తేదీ వరకూ గడువు ఇవ్వాలని యాజమాన్యంతో చర్చించి తమ సమస్యలు పరిష్కరిస్తామని ఇవ్వడంతో మధ్యాహ్నం ముదు గంటల సమయంలో బాధితులు ఆందోళన విరమించారు.

సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్

● ప్రభుత్వ విప్ జగదీశ్వరి



అధికారులతో ఫోన్‌లో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ జగదీశ్వరి

గుమ్మలక్ష్మీపురం, మే 24 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నామని ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. శనివారం గుమ్మలక్ష్మీపురంలోని తన క్యాంప్ కార్యాలయంలో ఆమె ప్రజాదర్బార్ నిర్వహించారు. నియోజకవర్గంలో పలు గ్రామాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పలు సమస్యలను పరిష్కరించారు. మిగతా కొన్ని వినతులను సంబంధిత శాఖ వారికి బదిలీ చేసి, పరిష్కారం అయ్యే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు.

పారిశుధ్య నిర్వహణపై దృష్టి సారించాలి

గరుగుబిల్లి, మే 24 (ఆంధ్రజ్యోతి): పంచాయతీల పరిధిలో పారిశుధ్య నిర్వహణపై కార్యదర్శులు ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీవో జి.పైడితల్లి, డిప్యూటీ ఎంపీడీవో సీహెచ్‌వీ కూర్మినాయుడులు సూచించారు. శనివారం గొట్టివలస సచివాలయం ఆవరణలో చెత్త సంపద కేంద్రం నిర్వహణపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మండలానికి సంబంధించి గొట్టివలస కేంద్రాన్ని మోడల్ కేంద్రంగా గుర్తించారని చెప్పారు. సంపద కేంద్రం పరిసరాలను శుభ్రంగా ఉంచాలని, ఖాళీ ప్రాంతాల్లో అవసరమైన పంటలను సాగు చేయాలని సూచించారు. సంపద కేంద్రాల నిర్వహణపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రిసోర్స్‌పర్సన్ ఎ.గణపతిరావు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు

గరుగుబిల్లి, మే 24 (ఆంధ్రజ్యోతి): మద్యం దుకాణ నిర్వాహకులు నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని సీతానగరం ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ డి.పద్మావతి హెచ్చరించారు. మండలంలోని మద్యం దుకాణాలను ఆమె శనివారం పరిశీలించారు. బెల్టు దుకాణాలకు మద్యం తరలించినా, అధిక ధరలకు అమ్మకం చేసినా చర్యలు తప్పవన్నారు. చట్టంలోని నియమ నిబంధనలను ఉల్లంఘిస్తే లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు. మద్యం దుకాణాల పరిధిలో ఇతర సామగ్రి అమ్మకాలు చేసినా చర్యలు తీసుకుంటామన్నారు.

రోడ్డున పడ్డాం.. ఉపాధి కల్పించండి



తహసీల్దార్ బాలకు వినతిపత్రం అందిస్తున్న ఎండీయూ వాహనాల ఆపరేటర్లు

గరుగుబిల్లి, మే 24 (ఆంధ్రజ్యోతి): కుటుంబాలతో రోడ్డున పడ్డాం.. ఉపాధి కల్పించి ఆదుకోవాలని కోరుతూ మండలంలో ఎండీయూ వాహనాల ఆపరేటర్లు శనివారం స్థానిక తహసీల్దార్ పి.బాలకు వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ 28 నెలలుగా అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించి బకాయిలు అందించలేదన్నారు. ఏప్రిల్‌కు సంబంధించి రూ.9వేలు బీమా మొత్తాలకు తమ వ్యక్తిగత ఖాతాల నుంచి జమ చేసుకున్నారని, ఈ మొత్తాన్ని చెల్లించాలని కోరారు. రెండేళ్ల ఒప్పందం ఉన్నప్పటికీ అకారణంగా తొలగించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బోను దిలీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కూలిన భారీ చెట్టు

● తొలగించిన పోలీసులు



చెట్టును తొలగిస్తున్న సీఐ తిరుపతిరావు, సిబ్బంది

జియ్యమ్మవలస, మే 24 (ఆంధ్రజ్యోతి): చినమేరంగి దళితవాడ వద్ద ప్రధాన రహదారిపై శుక్రవారం అర్ధరాత్రి భారీ వృక్షం కూలిపోయింది. దీంతో చినమేరంగి మీదుగా కురుపాం, గుమ్మలక్ష్మీపురం, పార్వతీపురం, పాలకొండ వైపు వెళ్లే వాహనాలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. విషయం తెలుసుకున్న చినమేరంగి సీఐ టీవీ తిరుపతిరావు, ఎస్ఐ పి.అనీష్ హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకున్నారు. వెంటనే ఆ చెట్టును రోడ్డుపై నుంచి తొలగింపజేసే ప్రయత్నం చేశారు. స్థానికుల సహాయంతో ప్రొక్లయినర్ ఉపయోగించి, సుమారు రెండున్నర గంటల పాటు శ్రమించి తొలగించారు. ఏఎస్ఐ బిడ్డిక తమ్మయ్య, పోలీస్ సిబ్బందితో పాటు దళితవాడ పెద్దలు, నవ చైతన్య యువజన సంఘ సభ్యులు పాల్గొన్నారు.

తోటపల్లి కాలువల ఆధునికీకరణే లక్ష్యం

పాలకొండ, మే 24 (ఆంధ్రజ్యోతి): తోటపల్లి కాలువల ఆధునికీకరణే తమ ఏకైక లక్ష్యమని సాధన సమితి కార్యదర్శి బుడితి అప్పలనాయుడు అన్నారు. శనివారం పాలకొండ ఎలైట్ కళాశాలలో ఎం.సింగుపురం డిస్ట్రిబ్యూటరీ చైర్మన్ చేబోదుల లక్ష్మీనారాయణ అధ్యక్షతన తోటపల్లి కాలువల ఆధునికీకరణ పనుల సాధన సమితి సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా అప్పలనాయుడు మాట్లాడుతూ 25 శాతం కంటే తక్కువ పనులు జరిగిన ప్రాజెక్టులను ప్రాధాన్యతా క్రమం నుంచి కూటమి ప్రభుత్వం తగ్గించడంతో ఆయకట్టు రైతులకు నిరాశే ఎదురయ్యిందని అన్నారు. తోటపల్లి బ్యారేజ్ వద్ద ఎడమ ప్రధాన కాలువ తూము రెండో తలుపు పనిచేయడం లేదని తెలిపారు. తక్షణమే మరమ్మతులు చేపట్టి సాగునీటికి ఆటంకం లేకుండా చూడాలని తీర్మానించారు. అలాగే వచ్చే ఖరీఫ్ సీజన్‌కు కాలువలో పూడికలు, తుప్పలు, డొంకలను తొలగించాలన్నారు. సీజనల్ లస్కర్లను నియమించాలని కోరారు. ఈ సమావేశంలో అల్లు శ్రీరామ్మూర్తి, రౌతు సోంబాబు, కిమిడి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వేతనం చెల్లించండి



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న పారిశుధ్య కార్మికులు

పార్వతీపురంటౌన్, మే 24 (ఆంధ్రజ్యోతి): గత ఏడాది విజయవాడ వరద బాధితులకు సహాయం చేయడానికి వెళ్లిన పార్వతీపురం మున్సిపాలిటీకి చెందిన పారిశుధ్య కార్మికులకు 8 రోజుల వేతనంతో పాటు టీఏ, డీఏలు చెల్లించకపోవడం విచారకరమని సీపీఎం జిల్లా నాయకుడు జీవీ రమణ ఆవేదన వ్యక్తం చేశారు. ఆ వేతనం చెల్లించాలని కోరుతూ శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ వెంకటేశ్వర్లుకు ఆయన ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులు వినతిపత్రాన్ని అందజేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని పారిశుధ్య కార్మికులు కోరారు. లేకపోతే ఇప్పలపోలమ్మ, యర్రకంచమ్మల పండుగల్లో పారిశుధ్య పనులు బహిష్కరిస్తామని హెచ్చరించారు. దీనికి కమిషనర్ స్పందిస్తూ పారిశుధ్య కార్మికులకు మూడు, నాలుగు రోజుల్లోగా న్యాయం చేస్తామని తెలిపారు.

ఇక్కడ నివసించేదెలా?

● కనీస సౌకర్యాలకు నోచుకోని కోమటిపల్లిలోని జగనన్న కాలనీ

● గృహ ప్రవేశాలకు వెనుకడుగు వేస్తున్న లబ్ధిదారులు



కోమటిపల్లిలో జగనన్న కాలనీ

బొబ్బిలి రూరల్, మే 24 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పేదలకు మంజూరు చేసిన ఇళ్ల స్థలాలు వృథాగా మిగిలిపోతున్నాయి. కనీస సౌకర్యాలు లేకపోవడంతో చాలామంది గృహ నిర్మాణాలు కూడా ప్రారంభించలేని పరిస్థితి నెలకొంది. గృహనిర్మాణ సామగ్రిని తీసుకువెళ్లేందుకు సరైన దారి కూడా లేదని లబ్ధిదారులు వాపోతున్నారు. ఇప్పటికే ఇళ్ల నిర్మాణం పూర్తిచేసిన వారు గృహప్రవేశాలకు వెనుకడుగు వేస్తున్నారు. ఇదీ బొబ్బిలి మండలం కోమటిపల్లి పంచాయతీలో గ్రామ సచివాలయం దగ్గరలో ఉన్న జగనన్న కాలనీ దుస్థితి. గత ప్రభుత్వం ఇక్కడ స్థానికులకు 27 ఇళ్లు మంజూరు చేసింది. అయితే ఇక్కడ సరైన సదుపాయాలు లేకపోవడంతో కేవలం ఎనిమిది ఇళ్ల నిర్మాణాలు మాత్రమే పూర్తయ్యాయి. కనీసం తాగునీరు, రహదారి సౌకర్యం లేకపోవడంతో ఆ లబ్ధిదారులు కూడా ఇంతవరకు గృహ ప్రవేశాలు చేయలేదు. మరో ఎనిమిది ఇళ్ల నిర్మాణం వివిధ దశల్లో ఉండగా, 11 నిర్మాణాలు ఇంకా ప్రారంభించలేదు. లేఅవుట్ మొత్తం తుప్పలతో నిండిపోయింది. కాలనీ ముందు ఒక ఖాళీ శిలాఫలకం మాత్రం దర్శనమిస్తోంది. ● ఈ జగనన్న కాలనీ దుస్థితిపై ఏఈ శ్యావణ్‌కుమార్‌ని వివరణ కోరగా, త్వరలోనే సమస్యలు పరిష్కరిస్తామన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



పార్వతీపురం: యోగా చేస్తున్న డీఎంహెచ్‌వో భాస్కరరావు, వైద్య శాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి జగన్మోహనరావు

పార్వతీపురం/ బెలగాం, మే 24 (ఆంధ్రజ్యోతి): యోగాతో ప్రతిఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యవంతులు అవుతారని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి ఎస్.భాస్కరరావు అన్నారు. యోగా మాసోత్సవాల్లో భాగంగా శనివారం స్థానిక ఎన్జీవో హోంలో 50 మంది వైద్య ఆరోగ్య సిబ్బందితో యోగా కార్యక్రమం నిర్వహించారు. ఢిల్లీ నుంచి విచ్చేసిన యోగా గురువు డా.నితిన్ నేతృత్వంలో వర్చువల్ విధానంలో మాస్టర్ ట్రైనీలకు ఇచ్చిన శిక్షణా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పాలకొండ, సాలూరులో కూడా సుమారు 60 మంది మాస్టర్ ట్రైనీలకు శిక్షణ ఇస్తున్నారని డీఎంహెచ్‌వో తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం అధికారి టి.జగన్మోహన్‌రావు, జిల్లా ఆయుష్ శాఖాధికారి సుశీల, యోగా గురువు మోహన్ తదితరులు పాల్గొన్నారు. ● సాలూరు: యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక వేంకటేశ్వర కల్యాణమండపంలో మున్సిపల్ కమిషనర్ డీటీవీ కృష్ణారావు ఆధ్వర్యంలో యోగా కార్యక్రమం నిర్వహించారు. యోగా గురువులు, మున్సిపల్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. ● పాలకొండ: నగర పంచాయతీ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో శనివారం మొరార్జీదేశాయ్ జాతీయ యోగా సంస్థ నుంచి ఆన్‌లైన్ ద్వారా మాస్టర్ ట్రైనీలకు శిక్షణ అందించారు. పాలకొండ నియోజకవర్గంలో భామిని, సీతంపేట, వీరఘట్టం మాస్టర్ ట్రైనీలకు శిక్షణ ఇచ్చారు. ఈ మాస్టర్ ట్రైనీలు మండల స్థాయిలో శిక్షణ ఇవ్వాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో యోగా గురువు జనార్ధనరావు, అధికారులు, వైద్యులు పాల్గొన్నారు.



సాలూరు: యోగాసనాలు వేస్తున్న అధికారులు



పాలకొండ: శిక్షణ పొందుతున్న మాస్టర్ ట్రైనీలు

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

బొబ్బిలి రూరల్, మే 24 (ఆంధ్రజ్యోతి): పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఐ జిల్లా నాయకుడు ఆనందరావు, పట్టణ కార్యదర్శి శ్రీనివాస్ డిమండ్ చేశారు. పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతూ జూన్ 2వ తేదీన మండల కార్యాలయాల వద్ద ధర్నా చేస్తామని తెలపారు. ఆ ధర్నాకు సంబంధించిన పోస్టర్లను బొబ్బిలి జెండామాల్ జంక్షన్‌లో శనివారం విడుదల చేశారు. అలాగే ప్రభుత్వం ప్రకటించిన సూపర్ సిక్స్ హామీలను త్వరలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

ఏజీపీగా సత్యనారాయణ

బొబ్బిలి రూరల్, మే 24 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి సీనియర్, జూనియర్ సివిల్ జడ్జెస్ కోర్టు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడరుగా బొబ్బిలికి చెందిన సీనియర్ న్యాయవాది చెల్లారపు సత్యనారాయణ నియమితులయ్యారు. శనివారం అమరావతి సచివాలయంలో న్యాయశాఖ ముఖ్య కార్యదర్శి గొట్టాపు ప్రతిమా దేవి.. సత్యనారాయణకు నియామక ఉత్తర్వులు అందించారు. ఆయన నియామకంపై ఎమ్మెల్యే బేబీనాయన, ఏపీ ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ సుజయ్‌కృష్ణ రంగారావు, బుడా చైర్మన్ తెంటు లక్ష్మునాయుడు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి అల్లాడ భాస్కరరావు, న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు.

లక్ష్యాలను చేరుకోవాలి

బొబ్బిలి రూరల్, మే 24 (ఆంధ్రజ్యోతి): ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణ, రీసర్వేలు, నీటితీరువా వసూళ్లపై వీఆర్వోలు దృష్టి సారించాలని తహసీల్దార్ మల్లపురెడ్డి శ్రీను ఆదేశించారు. బొబ్బిలి తహసీల్దార్ కార్యాలయంలో శనివారం ఆయన వీఆర్వోలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలన్నారు. ఎప్పటికప్పుడు రెవెన్యూ సమస్యలను పరిష్కరించే దిశగా పనిచేయాలన్నారు. ఈ సమావేశంలో సీహెచ్‌డీటీ సుబ్బారావు, ఆర్ఐ రాంకుమార్, వీఆర్వోలు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిని అభివృద్ధి చేస్తా

● బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన



వైద్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బేబీనాయన

బొబ్బిలి రూరల్, మే 24 (ఆంధ్రజ్యోతి): తన తండ్రి బొబ్బిలి రాజాశ్రీ ఆర్‌వీజీకే రంగారావు శతజయంతి సందర్భంగా స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిని తన సొంత నిధులతో అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే బేబీనాయన తెలిపారు. ఈసందర్భంగా శనివారం ఆయన బొబ్బిలి కోటలో ఆసుపత్రి వైద్యులతో మాట్లాడారు. ఆసుపత్రి అభివృద్ధి కోసం కావల్సిన నిధుల కోసం వైద్యఆరోగ్య శాఖ మంత్రితో గతంలో చర్చించిన విషయాన్ని తెలియజేశారు. వాటితో పాటు తన తండ్రి జ్ఞాపకార్థం సొంత నిధులతో ఆసుపత్రిని అభివృద్ధి చేయిస్తానని సూపరింటెండెంట్ జి.శశిభూషణరావుకు తెలిపారు. ఎక్కడెక్కడ అత్యవసర సౌకర్యాలు ఏర్పాటు చేయాల్సి ఉందో వైద్యులను అడిగి తెలుసుకున్నారు. త్వరలోనే తమ వ్యక్తిగత సిబ్బందిని పంపించి పనులు మొదలయ్యేలా చూస్తామని తెలిపారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెండింగ్ కేసులు పరిష్కరించండి



పోలీసులకు సూచనలు ఇస్తున్న డీఎస్పీ రాంబాబు

కురుపాం, మే 24(ఆంధ్రజ్యోతి): కురుపాం పోలీస్‌స్టేషన్‌ను పాలకొండ డీఎస్పీ ఎం.రాంబాబు శనివారం పరిశీలించారు. ఈసందర్భంగా రికార్డులు తనిఖీ చేశారు. పెండింగ్ కేసులు వేగవంతంగా పరిష్కరించాలని ఎస్ఐ పి.నారాయణరావుకు ఆదేశించారు. అనంతరం కానిస్టేబుళ్లు, హోంగార్డులతో మాట్లాడారు. వారి విధులు, బాధ్యతలపై అవగాహన కల్పించారు. శాంతి భద్రతలకు ఆటంకం కలగకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్విన్‌పేట సీఐ బి.హరి, ఎస్ఐ నారాయణరావు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థి మిత్ర కిట్లపై నిర్లక్ష్యం వహించొద్దు



విద్యా కిట్లను పరిశీలిస్తున్న అధికారులు

గరుగుబిల్లి, మ ఏ 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అందించే విద్యార్థి మిత్ర కిట్లుపై నిర్లక్ష్యం వహించరాదని సర్వశిక్ష ఏఎంవో జి.కోటేశ్వరరావు, యూఎంవో రాజారావులు సూచించారు. మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో గల స్టాక్ పాయింట్‌ను ఆయన శనివారం పరిశీలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలకు సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్లును చేరవేశారని తెలిపారు. పాఠ్య పుస్తకాలతో పాటు నోట్ పుస్తకాలు, బ్యాగ్‌లు, బెల్టులు, తదితర సామగ్రిని మండలాలవారీగా సరఫరా చేశారని చెప్పారు. ఈ సామగ్రి విషయంలో అవకతవకలకు ఆస్కారం లేకుండా దృష్టి సారించాలన్నారు. ఈ పరిశీలనలో ఎంఈవో-2 కె.కొండలరావు, సీఆర్పీలు బి.రామకృష్ణ, శంకరరావు, రాంబాబు, వై.యశోద, ఎంఐఎస్ కోఆర్డినేటర్ వి.శారద, ఎల్‌డీఏ బి.రమణమ్మ పాల్గొన్నారు.

షర్మిలమ్మ ఉక్కుదీక్ష భగ్నం అప్రజాస్వామికం

గుమ్మలక్ష్మీపురం, మే 24 (ఆంధ్రజ్యోతి): విశాఖ ఉక్కు కర్మాగారంలో తొలగించిన 2వేల మంది ఒప్పంద కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలంటూ ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి చేపట్టిన నిరవధిక దీక్షను పోలీసులు ఒక్కరోజులోనే భగ్నం చేయడం అప్రజాస్వామికం అని కాంగ్రెస్ పార్టీ కురుపాం నియోజకవర్గం కోఆర్డినేటర్ అడ్డాకుల చిన్నరావు మండిపడ్డారు. ఈమేరకు గుమ్మలక్ష్మీపురంలో శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ప్రజాస్వామ్య పంథాలో చేపట్టిన దీక్షను భగ్నం చేసి షర్మిలారెడ్డిని బలవంతంగా విశాఖ నుంచి హైదరాబాద్‌కు హుటాహుటిన తరలించడం సరికాదన్నారు.

న్యూస్ బాక్స్

రక్తపోటుపై అవగాహన ర్యాలీ

జియ్యమ్మవలస, మే 24 (ఆంధ్రజ్యోతి): వరల్డ్ హైపర్ టెన్షన్ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం జియ్యమ్మవలస పీహెచ్‌సీ వైద్యాధికారి పి.జగదీష్ ఆధ్వర్యంలో రక్తపోటు నియంత్రణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అధిక రక్తపోటు, మానసిక ఒత్తిడి, ఆందోళనపై ప్రజల్లో అవగాహన కల్పించారు. రక్తపోటు మనిషిలో అంతర్గత శత్రువుగా మెలుగుతూ ఎలాంటి లక్షణాలు కనిపించకుండా మనిషి మరణానికి కారణమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మార్పీకే మద్యం విక్రయాలు చేపట్టాలి

కురుపాం, మే 24(ఆంధ్రజ్యోతి): నిర్ణీత సమయంలో ఎమ్మార్పీ ధరలకే మద్యం విక్రయాలు చేపట్టాలని కురుపాం ఎక్సైజ్ సీఐ పి.శ్రీనివాసరావు అన్నారు. కురుపాంలోని మద్యం దుకాణాన్ని ఆయన శనివారం సాయంత్రం తనిఖీ చేశారు. ఉదయం 10 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు షాపులు తెరిచి ఎమ్మార్పీకి మాత్రమే అమ్మకాలు చేపట్టాలని ఆదేశించారు. నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

సారా రహిత గ్రామంగా రజ్జిలి

కురుపాం, మే 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏగులవాడ పంచాయతీ రజ్జిలి గ్రామాన్ని సారా రహిత గ్రీన్ గ్రామంగా ప్రకటించామని ఎక్సైజ్ సీఐ పి.శ్రీనివాసరావు తెలిపారు. నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా శనివారం రజ్జిలి గ్రామంలో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గత మూడు నెలలుగా జరిపిన దాడుల్లో ఈ గ్రామంలో సారా అమ్మకాలుగానీ తయారీ గానీ ఎవరిపై ఎటువంటి కేసులు కూడా నమోదు కాలేదని, దీంతో సారా అమ్మకాలు లేని గ్రామంగా గుర్తించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పి.అలివేలు, దత్తత అధికారి వై.కొండలరావు, వీఆర్వో రామరావు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఇంటర్ సీట్లు పెంచాలి

పార్వతీపురం, మే 24 (ఆంధ్రజ్యోతి): గిరిజన గురుకుల కళాశాలలో ఇంటర్మీడియట్ సీట్లు సంఖ్య పెంచాలని గిరిజన విద్యార్థి సంఘం నాయకులు డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకు శనివారం ఆ సంఘం నాయకుడు పి.సురేష్ ఒక ప్రకటన విడుదల చేశారు. గిరిజన గురుకుల కళాశాలల్లో అదనంగా సీట్లు కల్పించాలని కోరారు.

నవధాన్యాలతో ఆరోగ్యకర పంటలు

వేపాడ, మే 24 (ఆంధ్రజ్యోతి): రైతులు నవధాన్యాల సాగు చేయడం వల్ల ఆరోగ్యకరమైన పంటలు పొందవచ్చని,భూసారాన్ని పెంచుకోవచ్చు నని ప్రకృతి వ్యవసాయ మండల మాస్టర్ ట్రైనర్ ఈశ్వరరావు తెలిపారు. శనివారం కుమ్మపల్లి క్లస్టర్‌లో రైతులకు నవధాన్యాల సాగుపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ నవధాన్యాల సాగుకు రైతు లకు అవసరమైన కిట్లనుఆర్ఎస్‌కేలలో సిద్ధంగా ఉంచా మన్నారు. కార్యక్రమంలో ప్రకృతివ్యవసాయం మాస్టర్ ట్రైనర్ సన్యాసమ్మ పాల్గొన్నారు.

వికసించిన బ్రహ్మకమలం



గరుగుబిల్లి, మే 24 (ఆంధ్రజ్యోతి): తోటపల్లిలో బ్రహ్మ కమలం పువ్వులు వికసించాయి. తోటపల్లి గ్రామానికి చెందిన డొల్లు గౌరునాయుడు ఇంటి ఆవరణలో ఐదేళ్ల కిందట బ్రహ్మ కమలం మొక్క ను నాటారు. శనివారం ఈ మొక్కకు పూలు పూచాయి. ఈ పూవులను స్థానికులు ఆసక్తిగా తిలకిస్తున్నారు.

సమీకృత గిరిజన అభివృద్ధి సంస్థ – సీతంపేట

రేఖా సంఖ్య: 1/2024/PVTG VDVK/LH/TPMU తేది: 22-05-2025

షార్ట్ టెండర్ నోటీస్

సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ, సీతంపేట వారి ఆధ్వర్యంలో ఐ.టి.డి.ఎ సీతంపేట వన్ ధన్ వికాస కేంద్రాలు కొరకు అవసరమగు యంత్ర పరికరములు సంబంధిత VDVK కేంద్రాలుకు సరఫరా చేయుటకు గాను ఆసక్తి గల సరఫరాదారుల నుండి సీల్డ్ కొటేషన్లు కోరబడుచున్నవి.

సదరు కొటేషన్లు ప్రాజెక్ట్ అధికారి, ఐటిడిఎ, సీతంపేట వారి పేరున రూ.25,000/- డి.డి (ఈ.యం.డి) లను తే. 30-05-2025 ది సాయంత్రం 3.00 గంటలలోపు టెండర్ బాక్స్‌లో వెయవలెను. అదే రోజు సాయంత్రం 5.00 గంటలకు టెండర్ తెరవబడును. ఎటువంటి కారణం లేకుండా టెండరును రద్దు చేయు అధికారం ఐటిడిఎ, ప్రాజెక్ట్ అధికారి వారికి కలదు. ఇతర వివరములకు ఐటిడిఎ నెం. 8008803939, 8008803873 కు సంప్రదించగలరు.

ప్రాజెక్ట్ అధికారి
ఐటిడిఎ, సీతంపేట

ధర్నా జయప్రదం చేయండి

జియ్యమ్మవలస, మే 24 (ఆంధ్రజ్యోతి): పూర్ణపాడు - లాబేసు వంతెన పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 26న కొమరాడ తహసీల్దార్ కార్యాలయం ముందు చేపట్టనున్న ధర్నాను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.సాంబమూర్తి పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం ఆయన కూనేరు సంతలో ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు గిరిజన సంఘాల నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేని కలిసిన డీసీసీబీ చైర్మన్

పాలకొండ, మే 24 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) చైర్మన్ శివ్వాల సూర్యనారాయణ శనివారం పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణను ఎం.రాజపురంలోని మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువతో ఎమ్మెల్యేను సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ డీసీసీబీ సేవలు ప్రజలకు అందుబాటులో ఉండేలా కృషి చేస్తానన్నారు.

చెత్త నుంచి సంపద తయారీపై దృష్టి సారించాలి

సీతానగరం, మే 24 (ఆంధ్రజ్యోతి): పంచాయతీల ఆర్థికాభివృద్ధికి చెత్త నుంచి సంపద తయారు చేయాలని డిప్యూటీ ఎంపీడీవో కె.కుమారవర్మ అన్నారు. స్వచ్ఛాంధ్రప్రదేశ్‌లో భాగంగా శనివారం స్థానిక ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రంలో పంచాయతీ కార్యదర్శులతో ఆయన చెత్త నుంచి సంపద తయారీపై చేపట్టవలసిన విధి విధానాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీపీవో సూచనల మేరకు గ్రామాల్లోని ఎస్‌డబ్ల్యూపీసీలను పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురావాలని కోరారు. గ్రామాల్లో పారిశుధ్య పనులపై దృష్టి సారించాలన్నారు.